TITLE CODE: APTEL16281

తెలుగు దినపత్రిక

# పీపుల్స్ మోటివేషన్

People's Motivation

ఆంధ్రప్రదేశ్ / తెలంగాణ

సంపుటి : 01 | సంచిక : 167 | ఎడిటర్ : ఎం. రమేష్ | శనివారం, మే 18, 2024 | పేజీలు : 08 | వెల రూ. 5.00/-

# మేం హ్యాట్రిక్ విజయం సాధించబోతున్నాం

- ఇండియా కూటమి బలహీనతే మా బలం
- రామాలయాన్ని బుల్‌డోజర్లతో కూలుస్తామంటున్నారు
- అలాంటి వారికి ఓటర్లు బుద్ధి చెప్పాలి
- బుల్‌డోజర్ల ఉపయోగం యోగి నుంచి తెలుసుకోవాలి
- యూపి ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ విమర్శలు

**లక్నో,మే17(పీపుల్స్ మోటివేషన్) :**

రాయబరేలి ప్రజలు ప్రధానిని ఎన్నుకుంటారంటూ కాంగ్రెస్ నేత ఒకరు చెప్పడాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎద్దేవా చేశారు. మోదీ ప్రభుత్వం 'హ్యాట్రిక్' సాధించి తీరుతుందని అన్నారు. ప్రజలు అభివృద్ధికి పట్టం కడతారని అన్నారు. 'ఇండియా' కూటమి నేతలు ఒక్కొక్కరే జారుకుంటున్నారని అన్నారు. సమాజ్‌వాదీ పార్టీ రాజకుమారుడు అఖిలేష్ యాదవ్ ఒక కొత్త ఆంటీ (మమతా బెనర్జీ) గొడుగు కింద చేరారు. ఆ కొత్త ఆంటీ పశ్చిమబెంగాల్‌లో ఉంది. మీకు బయట నుంచి మద్దతు ఇస్తామని ఆ కొత్త ఆంటీ ఇండియా కూటమికి చెబుతోందని మోదీ వ్యాఖ్యానించారు. దేశాన్ని మెరుగుపరచేందుకు బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ఒకవైపు, దేశంలో అస్థిరత సృష్టించేందుకు ఇండియా కూటమి ఒకవైపు ఉందని, ఎన్నికలు నడుస్తున్న కొద్దీ ఇండియా కూటమి నేతలు ఒక్కొక్కరే కూటమి నుంచి జారిపోరుతున్నారని చెప్పారు. కేంద్రంలో రాబోయే కొత్త ప్రభుత్వంలో పేదలు, యువకులు, మహిళలు, రైతుల కోసం ఎన్నో పెద్దపెద్ద నిర్ణయాలు తీసుకోనున్నామని మోదీ చెప్పారు. జాతీయ ప్రయోజనాలకు బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే అంకితమైందని చెప్పారు. ఇండియా కూటమి నేతలు ప్రధానులవు తామంటూ పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. తాను 'హ్యాట్రిక్' కొట్టేందుకు, సమాజంలోని అన్నివర్గాల కోసం పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు.







500 ఏళ్ల తర్వాత రామాలయం కల సాకారమైందంటే దానికి ప్రజల ఓటు బలమే అందుకు కారణమని అన్నారు. రామమందిరంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తోసిరాజనేందుకు, మందిరంపై బుల్‌డోజర్ నడిపేందుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉన్నట్టు తమకు తెలిసిందని, న్యాయబద్ధంగా బుల్డోజర్ నడిపించడం ఎలాగో యోగి ఆదిత్యనాథ్ నుంచి కాంగ్రెస్ వాళ్లు తెలుసుకోవాలని సూచించారు. ఇండియా బ్లాక్‌కు ప్రజలు ఓటు వేసి అధికారం ఇస్తే, ఎస్సీ, ఎస్టీ, ఆదివాదీ, ఓబీసీల రిజర్వేషన్లను లాక్కొని తమ ఓటర్లకు ఇవ్వడం ద్వారా బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతుందని హెచ్చరించారు. ప్రధానమంత్రి యూపీలోని ఫతేపూర్, హమీర్‌పూర్‌లోనూ శనివారంనాడు బహిరంగ సభల్లో పాల్గొంటున్నారు.

# బెజవాడను ముంచెత్తిన వాన

వరదలతో నగరంలో పొంగిన నాలాలు

**విజయవాడ,మే17(పీపుల్స్ మోటివేషన్):**

తెలుగు రాష్ట్రాల్లో ఒక్కసారిగా వాతావరణంలో పెను మార్పులు చోటు చేసుకున్నాయి. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని అనేక జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. గురువారం ఇటు హైదరాబాద్, అటు బెజవాడలో ఉన్నట్టుండి వర్షం కురిసింది. భాగ్యనగరంలో గంట పాటు వర్షం పడగా.. అటు విజయవాడలో మాత్రం వర్ష బీభత్సం కొనసాగుతోంది. బెజవాడలో గత రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. రోడ్డుపై పెద్ద ఎత్తున వర్షపు నీరు చేరుకోవడంతో డ్రైనేజీలు పొంగిపొర్లు తున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. రాత్రి నుంచి కరెంట్ లేకపోవడంతో ప్రజలు ఇక్కట్లకు గురయ్యారు. మరోవైపు నైరుతీ రుతుపవనాలు ఈ నెల 19 నాటికి అండమాన్ సముద్ర ప్రాంతానికి వస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ నెలాఖరికి కేరళకు, జూన్ మెదటి వారంలో ఏపికి నైరుతీ రుతుపవనాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ పేర్కొంది.



# కవితపై రాజకీయదురుద్దేశ్యంతో కేసులు

- ఆమె ధైర్యంగా ఉన్నారన్న ప్రవీణ్ కుమార్
- ఉదయం తీహార్ జైలులో కవితతో భేటీ

**న్యూఢిల్లీ,మే17(పీపుల్స్ మోటివేషన్) :**

లిక్కర్ స్కామ్‌లో అరెస్టై జైల్లో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితతో బీఆర్ఎస్ నేతలు ములాఖత్ అయ్యారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, బాల్క సుమన్ పది గంటలకు తీహార్ జైలుకు వెళ్లి ఆమెతో మాట్లాడారు. జైలులో కవితతో సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్...' కవిత చాలా ధైర్యంగా ఉన్నారు. నిర్దోషిత్వాన్ని నిరూపించుకుంటాననే నమ్మకంతో ఉన్నారు. రాజకీయ దురుద్దేశంతో పెట్టిన కేసులని లాయర్‌కి నోటీసులు ఇవ్వకుండా సీబీఐ అరెస్టు చేసిరంటేనే ఎంత దారుణంగా ఉన్నారో అర్థం అవుతుంది. రాత్రికి రాత్రి జడ్జిని మార్చారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచుకోవడానికి ఆ ప్రభుత్వాలు పాలసీలు రూపొందిస్తారు, అందులో ఉన్నవాళ్ళందరిని దోషులుగా చేరుస్తామంటే ఎలా?. రైతు చట్టాలు సహా అనేక పాలసీలు మోడీ తీసుకొచ్చారు. అవి ఎవరి ప్రయోజనాలకోసం తీసుకొచ్చారని అన్నారు. కవిత దగ్గర నుంచి ఒక్క రూపాయి డబ్బు దొరక్కుండా పీఎంఎల్ఏ ఎలా వర్తిస్తుందని ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. లంచం డిమాండ్ చేసినట్లు ఆధారాలు లేవని... అవినీతి నిరోధక చట్టం ప్రకారం సీబీఐ ఎలా అరెస్ట్ చేస్తారని నిలదీశారు. వాళ్ళ పేర్లు, వీళ్లా పేర్లు చెప్పండి అంటూ కవితపై అధికారులు ఒత్తిడి తెస్తున్నట్లుగా కవిత చెప్పారు. ఈడీ దుర్మార్గంగా వ్యవహరిస్తోంది. బీజేపీ లో చేరినవారిపై ఒకలా, చేరనివారిపై మరోలా సెలెక్టీవ్ గా ఈడీ వ్యవహరిస్తోంది. విపక్షాల గొంతు నొక్కేందుకు సీబీఐ, ఈడీ ని బీజేపీ వాడుకుంటుంది. బాల్క సుమన్ మాట్లాడుతూ... 'కవిత మానసికంగా బలంగా ఉన్నారు. విపక్ష నాయకులను అణిచివేయలనే అన్యాయంగా కవితను ఈకేసులో ఇరికించారు. న్యాయస్థానలపై నమ్మకం ఉంది, న్యాయం జరుగుతుందనే ఆశాభావంతో ఉన్నారు. బీజేపీకి ఎవరు ఎదురు ఉండకూడదనే ప్రతిపక్షాలను భయభ్రాంతులకు గురిచేసింది. ఢిల్లీ లిక్కర్ కేసు కేసే కాదు, అదొక పాలసీ... దాన్ని బూచిగా చూపించి తెలంగాణలో బిఅరెస్, ఢిల్లీలో ఆప్ పార్టీని దెబ్బతీసే కుట్ర. లిక్కర్ పాలసీతో ఢిల్లీ ప్రభుత్వానికి లాభమే జరిగింది. బీజేపీ వంటకాన్ని వండి....సీబీఐ, ఈడీని ఆప్, బిఅరెస్ మీదకి వదిలింది. ఇలాంటి కేసులతో మమ్మల్ని భయభ్రాంతులకు గురి అవుతామనే భ్రమలో బీజేపీ నేతలు ఉన్నారు, కానీ భయపడే ప్రసక్తే లేదు. దేశంలో పాసిస్ట్ పాలన నడుస్తుంది. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఘోరంగా దెబ్బతిన్నది. బీజేపీ 220 సీట్లు దాటదు. వచ్చేది సంకీర్ణ ప్రభుత్వమే. ప్రతిపక్షాల నేతలను జైల్లో పెట్టి ప్రజాతీర్పును వారికి అనుకూలంగా మార్చుకునే ఎత్తుగడలకు ప్రజలు సరైన రీతిలో తీర్పు చెప్పనున్నారు. బీజేపీ కి వ్యతిరేకంగా ఎన్ని కేసులు పెట్టిన తలవంచకుండా పోరాటం చేస్తాం. మొండిగానే పోరాడుతామని కవిత చెప్పారు.



## విశాఖలోనూ ప్రశాంతతను

# దెబ్బతీసారు

- పిన్నెల్లి అరెస్ట్‌తోనే పల్నాడులో శాంతి
- పోలీసులు సరిగా వ్యవహరించకపోవడంతోనే సమస్యలు
- టిడిపి అధినేత చందరబాబు నాయుడు

**అమరావతి,మే17(పీపుల్స్ మోటివేషన్):**



రాష్ట్రంలో పోలింగ్ అనంతరం వైసీపీ రౌడీల దాడులపై తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడులను కంట్రోల్ చేయడంలో పోలీసులు విఫలమయ్యారని విమర్శించారు. చివరికి ప్రశాంతమైన విశాఖలో కూడా వైసీపీ మూకలు దాడులకు తెగబడుతున్నారని మండిపడ్డారు. వైసీపీ ఇచ్చిన డబ్బులను నిరాకరించి టీడీపీకి ఓటు వేశారనే కారణంతో నలుగురిపై వైసీపీ మూకలు దాడులు చేశారని మహిళలపై కూడా పాశివికంగా దాడికి పాల్పడ్డారని చంద్రబాబు అన్నారు. ఈ దాడుల విషయంలో పోలీసులు ఉదాసీనంగా వ్యవహరించడంవల్లనే శాంతి భద్రతల సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. పల్నాడులో ఇప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని వైసీపీ రౌడీ మూకల ఇళ్లల్లో బాంబులు, మారణాయుధాలు పెట్టుకుని దాడులకు తెగబడుతున్నారని చంద్రబాబు వ్యాఖ్యానించారు. పోలీసులు పూర్తి స్థాయిలో తనిఖీలు నిర్వహించి గూండాలను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మాచర్లలో మారణ హోమానికి కారణమైన ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి పై కేసులు పెట్టి వెంటనే అరెస్టు చేస్తే తప్ప దాడులు ఆగే పరిస్థితి లేదని అన్నారు. విజయవాడ భవానీపురంలో పోలింగ్ రోజు జరిగిన దాడి కేసులో నిందితుడు పోలీస్ స్టేషన్ నుంచి పారిపోవడం పోలీసుల ఉదాసీన వైఖరికి నిదర్శనమని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల హింసలో నిందితులపై కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. తప్పు చేసిన పోలీస్ అధికారులను బదిలీ చేయడమే కాకుండా.. వారిపై కూడా కేసులు నమోదు చేసి విచారణ చేపట్టాలని చంద్రబాబు డిమాండ్ చేశారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation



# వివేకా హత్యపై ప్రస్తావన

**కడప కోర్టుపై సుప్రీం స్టే**

**న్యూఢిల్లీ,మే17(పీపుల్స్ మోటివేషన్):**

సుప్రీంకోర్టులో వైసీపీ అధినేత, సీఎం వైయస్ జగన్‌కు మరో ఎదురు దెబ్బ తగిలింది. వైయస్ వివేకా హత్య కేసు అంశాన్ని ఎన్నికల ప్రచారంలో ప్రస్తావించ కూడదంటూ కడప కోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు శుక్రవారం స్టే విధించింది. అలాగే వైయస్ షర్మిలతో పాటు ఇతరులపై దాఖలైన కోర్టు ధిక్కరణ కేసులపైనా కూడా సుప్రీంకోర్టు స్టే విధించింది. ఎన్నికల ప్రచారంలో వైయస్ వివేకా హత్య కేసు ప్రస్తావించవద్దంటూ కడప కోర్టు ఇచ్చిన ఉత్తర్వులు భావ ప్రకటనా స్వేచ్ఛకు విరుద్ధంగా ఉన్నాయని సుప్రీంకోర్టు ఈ సందర్భంగా అభిప్రాయపడింది. దీంతో ఈ అంశంలో వైయస్ షర్మిల, సునీత నర్రెడ్డిలకు ఊరట లభించినట్లు అయింది. అయితే ఇప్పటికే ఎన్నికలు ముగియడంతో ఇప్పుడు పెద్దగా లాభించే అవకాశం లేదు. కడప లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పీసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల బరిలో దిగారు. ఆ క్రమంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా తన చిన్నాన్న వైయస్ వివేకా హత్య అంశాన్ని పదే పదే ప్రస్తావించారు. ఈ హత్య కేసులో అసలు సిసలు సూత్రధారులంటూ కడప ప్రస్తుత ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి, వైయస్ భాస్కరరెడ్డిలను ఆమె వివిధ సందర్భాల్లో గుర్తు చేస్తున్నారు. అయితే ఈ హత్య కేసులో ప్రమేయమున్న వైయస్ అవినాష్ రెడ్డికి మరోసారి కడప ఎంపీ టికెట్.. ఆ పార్టీ అధినేత వైయస్ జగన్ కేటాయించారంటూ వైయస్ షర్మిలతోపాటు వైయస్ వివేకా కుమార్తె సునీత నర్రెడ్డి నేరుగా ప్రజల్లోకి వెళ్లి ఆరోపణలు సంధిస్తున్నారు. దీంతో ఎన్నికల ప్రచారంలో వైయస్ వివేకా హత్య కేసు అంశాన్ని వైయస్ షర్మిల, సునీత ప్రస్తావించ కుండా ఆదేశాలు ఇవ్వాలంటూ.. కడప జిల్లాలోని వైసీపీ నాయకులు స్థానిక జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రచారంలో వైయస్ వివేకా హత్య కేసు అంశాన్ని ప్రస్తావించ వద్దంటూ 'వారిని' కోర్టు ఆదేశించింది. దీనిపై వైయస్ షర్మిల, సునీత నర్రెడ్డిలు.. సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో వైయస్ వివేకా హత్య కేసు అంశంలో కడప కోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు తాజాగా స్టే విధించింది.

# ప్రాంతీయ భావోద్వేగాలను తక్కువ చేయరాదు

**దక్షిణాదిలో ప్రాంతీయ పార్టీలదే ప్రాబల్యం**

**బిఆర్ఎస్‌కు అనుకూలంగా విజయశాంతి వ్యాఖ్యలు**

**హైదరాబాద్,మే17(పీపుల్స్ మోటివేషన్) :**

రాజకీయాల్లో కొంత కాలంగా సైలెంట్ గా ఉన్న విజయశాంతి హఠాత్తుగా బీఆర్ఎస్‌కు మద్దతుగా తెరపైకి వచ్చారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ ఉండదని కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను విజయశాంతి ఖండించారు. ప్రాంతీయ భావోద్వేగాలు ప్రజా మనోభావాలను వారి ఆత్మాభిమానం వైపు నడిపిస్తూనే వస్తుండడం దక్షిణాది రాష్ట్రాల సహజ విధానమననారు. ఈ దక్షిణాది స్వీయ గౌరవ అస్థిత్వ సత్యం కాంగ్రెస్ అర్థం చేసుకున్నట్లు, బీజేపీ కనీసం ఆలోచన చెయ్యని అంశం బహుశా కిషన్ రెడ్డి గారి ప్రకటన భావం అని చెప్పుకొచ్చారు. నిజానికి ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ ఉండదని బీజేపీ నేతలే కాదు కాంగ్రెస్ నేతలు కూడా విమర్శలు గుప్పిస్తున్నారు. అయితే విజయశాంతి కాంగ్రెస్ పార్టీ అర్థం చేసుకుందని.. బీజేపీ నేతలే అర్థం చేసుకోలేదన్నట్లుగా సోషల్ మీడియాలో స్పందించారు. ప్రస్తుతం విజయశాంతి కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. గత ఎన్నికలకు ముందు ఆమె బీజేపీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కానీ కాంగ్రెస్ పార్టీ ఆమెను పట్టించుకోలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి ఆమె పేరు పరిగణనలోకి తీసుకోలేదు. పార్లమెంట్ ఎన్నికల్లోనూ పట్టించుకోలేదు. కనీసం ప్రచారానికి కూడా పిలువలేదు. కాంగ్రెస్ తీరుపై ఆమె అసంతృప్తిలో ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది. విజయశాంతి సొంత పార్టీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చినప్పటికీ తర్వాత తన పార్టీని టీఆర్ఎస్ లో విలీనం చేశారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి టీఆర్ఎస్ తరపున ఎంపీగా గెలిచారు. పెద్ద ఎత్తున తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. పార్లమెంట్ లో పోరాడారు. తెలంగాణ ఇస్తే.. టీఆర్ఎస్ ను కాంగ్రెస్ లో విలీనం చేస్తామని కేసీఆర్ ప్రకటించారు. అయితే తెలంగాణ ఏర్పాటు తర్వాత అలా చేయలేదని విజయశాంతి బీఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్ లో చేరారు. కాంగ్రెస్ తరపున మెదక్ అసెంబ్లీకి పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొనకపోయినప్పటికీ.. కాంగ్రెస్ లోనే కొనసాగారు. 2018 ముందస్తు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ గా ఉన్నారు. అయితే ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయింది. ఆ తర్వాత బీజేపీలో చేరిపోయారు. బీజేపీలో చేరినా ఎన్నికల వరకూ ఉండలేదు. బీఆర్ఎస్ ను ఓడించే పార్టీ కాంగ్రెస్సేనని అనుకుని మళ్లీ ఆ పార్టీలో చేరారు. ఇన్ని పార్టీలు మారడం వల్ల ఆమెకు రాజకీయాల్లో ప్రాధాన్యత తగ్గుతూ వచ్చింది. తాజాగా బీఆర్ఎస్ కు మద్దతుగా మాట్లాడుతూండటం ఆసక్తికరంగా మారింది.

# రక్తనిధి నిల్వలో నిర్లక్ష్యం తగదు

**ప్రోత్సాహంతో పాటు కేంద్రాలను పెంచాలి**

**విజయవాడ,మే17(పీపుల్స్ మోటివేషన్):**

సురక్షితమైన రక్తం అందుబాటులో ఉండేలా చూడడానికి, జిల్లాకొక ప్రభుత్వ రక్త నిధి కేంద్రం స్థాయి పెంచడం ద్వారా నాణ్యమైన సేవలందించాలని సిఫార్సు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటి వరకు జిల్లాలో అలాంటి రక్త నిధుల ఏర్పాటు అంతంతమాత్రంగానే ఉన్నాయి. రక్తం సేకరించిన తేదీ, దాతపేరు, చిరునామా, వయస్సు, బరువు, హిమోగ్లోబిన్ శాతం, రక్తం గ్రూపు మొదలైన అంశాలను సూచిస్తూ రక్తదాతల రిజిస్టర్‌ను రక్త నిధి కేంద్రాలు నిర్వహించాలి. ఆరోగ్యంగా ఉండి రక్తదానానికి ఒప్పుకున్న దాత నుంచి మాత్రమే రక్తం సేకరించినట్టు సంచులపై సూచికలు అతికించాలి. అంతేకాక నిర్ణీత ప్రమాణాలు లేని రక్త నిల్వలను నాశనం చేసేందుకు, రక్తమార్పిడి ద్వారా అంటురోగాలు ప్రబలకుండా చూసేందుకు ఇది దోహద పడుతుంది. దీనివల్ల రోగులకు అనుకూలంకాని రక్తం ఇచ్చే ప్రమాదం ఉండదు. జిల్లాలోని రక్త నిధి కేంద్రాలను కలుపుకుని రక్త నిధులన్నింటిలోనూ సేకరించిన రక్తపు యూనిట్లు–, నిర్ణీత గడువులోగా ఉపయోగించకపోవడం వల్ల పడేయాల్సి వస్తోందని ఆడిట్ అధ్యయనంలో తేలింది. రక్తానికి బదులు కచ్చితం గా అవసరమైన భాగాలను మాత్రమే ఉపయోగించడం వల్ల రక్తాన్ని సంపూర్ణంగా వినియోగించుకోవడం అవసరమని ప్రపంచ ఆరోగ్య సంస్థ స్పష్టం చేసింది.

# పాక్ ఆక్రమిత కాశ్మీర్‌పై తేల్చాల్సిందే

ఇంతకాలం కాశ్మీర్‌లో అణచివేత గురించి మాట్లాడిని నేతలు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో జరుగుతున్న ఆందోళనల గురించి మాట్లాడడం లేదు. 370 ఆర్టికల్ రద్దు చేయగానే గగ్గోలు పెట్టిన నేతలు పివోకె విషయంలో నోరు మెదపడం లేదు. నోట్లో విషం పెట్టుకున్న ఫరూక్ అబ్దుల్లా, మెమబూబా ముఫ్తీలు కూడా మాట్లాడడం లేదు. ఎందుకంటే వీరంతా పాక్ పన్నాగాలను ఆహ్వానించేవారు. వీరంతా పాక్ చర్యలను సమర్థించేవారు. ఆక్రమిత కాశ్మీర్లో దౌర్జన్యకాండ పెరిగిపోతోంది. అక్కడి ప్రజలు తట్టుకోలేక రోడ్లమీదకు వస్తున్నారు. మేం భారత్‌తోనే ఉంటామని ఎలుగెత్తి చాటుతున్నారు. పాక్‌లో ప్రభుత్వం మారినా పరిస్థితి మారలేదనడానికి ఇది నిదర్శనం. ఇకపోతే కాశ్మీర్‌లో ఇంతకాలం రక్తపుటేరులు పారేవి. దేశంలో బాంబు దాడులు సహజంగా సాగేవి. కానీ 370 ఆర్టికల్ రద్దు తరవాత, కాశ్మీర్ అంతర్భాగం అయ్యాక అలాంటి హింస తగ్గింది. పాక్ ఆక్రమిత కాశ్మీర్ విషయంలో గత పాలకులు ఏనాడూ పట్టబట్టలేదు. ఎన్నో యుద్ధాల్లో పాక్ ఓడిపోయి మనముందు సలాం చేసినా పివోకెను వమనం వెనక్కి తీసుకోవాలన్న ఆలోచన రాలేదు. ఇంతజరుగుతున్నా కనీసం స్పందించని మాజీముఖ్యమంత్రులు ఫరూఖ్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీలు గతంలో మాత్రం కాశ్మీర్ ఫైల్స్‌పై అక్కసు వెళ్లగక్కారు. గతంలో ఎన్నో కిరాతకాలకు ప్రతిరూపంగా తీసిని సినిమా అది. ఇది నిజమన్న సంగతి ఈ ఇద్దరు సిఎంలకు బాగా తెలుసు. కాశ్మీర్‌లో ప్రత్యేక హోదాను అడ్డంపెట్టుకుని అక్కడ రాచరికం అనుభవించిన నేతలు వీరు. అయినా వీరిలో మార్పురాలేదనడానికి తాజా వారి స్పందనలే నిదర్శనం. కాశ్మీర్‌లో ఇప్పటికే 75శాతం పండిట్లను ఊచకోత కోసారు. ఉన్నవారు ఊరు విడిచి వెళ్లిపోయారు. దేశంలో ఎక్కడో ఓ చోట తలదాచుకుంటున్నారు. అయినా వారికి న్యాయం చేయాలన్న జ్ఞానం ఈ నేతలకు లేదు. కాశ్మీర్‌లో శాంతియుత పరిస్థితులు నెలకొనడం అత్యావశ్యకం. అక్కడి అమాయక ప్రజలు ఉగ్రమూకల కారణంగా జీవితాలు కోల్పోరాదు. వారు ఏ మతం వారైనా సామాన్యులే అన్న విషయం గుర్తించాలి. అందుకే ఇక కాశ్మీర్ విషయంలో తేలాల్సింది పాక్ ఆక్రమిత కాశ్మీర్ సమస్య మాత్రమే. దీనిని అంతర్జాతయ సమస్యను చేయడం ద్వారా పాక్ పీచమణచాలి. కాశ్మీర్‌పై నానాయాగీ చేస్తూ రాజకీయ పబ్బం గడుపుకుంటూ భారత్‌ను చికాకు పెట్టే పాక్ కుతంత్రాలకు దీటుగా జవాబివ్వాలి. పాక్ ఆక్రమిత కాశ్మీరీలు కూడా అక్కడ అణచివేతకు పోరాడుతున్నారు.

తమను భారత్ కాశ్మీర్‌లో కలపాలని ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. 370 ఆర్టికల్ రద్దు తరవాత పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ప్రజలు స్వచ్ఛందగా అక్కడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పారు. ఈ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటే కాశ్మీర్‌లో ప్రశాంత పరిస్థితులకు కృషి చేస్తూనే ఆక్రమిత కాశ్మీర్ స్వాధీనానికి అడుగులు వేయాలి. అలాగే దేశం యావత్తూ కేంద్రం తీసుకుంటున్న చర్యలు స్వాగతించాలి. కశ్మీర్ అంశంపై భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తమ స్వరాన్ని పెంచి, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ లక్ష్యంగా నినదించాలి. నిజానికి తమ అజెండా ఇక పాక్ ఆక్రమిత కాశ్మీర్ అని చెప్పడం ద్వారా సమస్యపై పాక్‌కు సవాల్ విసిరారు. ఇంతకాలం కాశ్మీర్ సమస్యను అడ్డుగా పెట్టి అరాచకం చేస్తున్న పాక్‌కు పివోకే ఆందోళనలు కనువిప్పు కలిగించాలి. ఉగ్రవాదాన్ని ఎగదోయడాన్ని ఆపనంత కాలం పాకిస్థాన్‌తో చర్చలు అసాధ్యమని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పదేపదే స్పష్టం చేసి పాక్ కుతంత్రాలను ప్రపంచానికి తెలియచేసారు. ఒకవేళ పాక్‌తో చర్చలు జరపాల్సి వస్తే అవి పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) పైనే ఉంటాయని తేల్చి చెప్పాలి. ఇది కాక మరో అంశంపై సంప్రదింపులు ఉండబోవని కుండబద్దలు కొట్టాలి. ఉగ్రవాదం ద్వారా భారత్‌ను అస్థిరపరిచి విచ్ఛిన్నం చేయాలని పాక్ కుట్ర పన్నుతోందని ప్రపంచం యావత్తూ గుర్తించిన నేపథ్యంలో పాక్ ఆక్రమిత కాశ్మీర్ ఎజెండాగా పనిచేయాలి. 370' రద్దు తర్వాత ఇప్పుడు పీవోకే ప్రజలు భారత్‌లో విలీనం కావాలని కోరుకుంటున్నారు. పాక్ అక్రమ కబ్జా నుంచి పీవోకేకి విముక్తి కల్పించి, భారత్‌లో అంతర్భాగంగా మార్చాలన్న వారి కలను సాకారం చేయాలి. పీవోకే రాజధాని ముజఫరాబాద్‌ను మనం స్వేచ్ఛగా సందర్శించే రోజు రావాలని కోరుకుందాం. ఇదే క్రమంలో పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ప్రజల అణచివేతపై పోరాడాలి. అలాగే మన కాశ్మీర్‌లో అశాంతి రాజేస్తున్న ఉగ్రమూకలను చీల్చి చెండాడాలి. ఇదిలా ఉండగా.. జమ్ము కశ్మీర్‌లో ఉగ్రవాదులను ఏకాకులను చేస్తున్నామని, దీంతో వారికి ప్రజలను తప్పుదోవ పట్టించే అవకాశం లేకుండా పోయిందని పోలీస్ అధికారులు అంటున్నారు. రాష్ట్రంలో సానుకూల దృక్పథంతో అభివృద్ధి జరుగుతోందని, ప్రజలు కూడా దీనిని అర్థం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. పరిస్థితులు ఏమాత్రం చేయి దాటిపోకుండా భద్రతా బలగాలు కృషి చేస్తున్నాయన్నారు. ఇంత జరుగుతున్నా పాక్ తన ప్రేలాపనలు ఆపడం లేదు. మొత్తంగా కశ్మీర్‌లో పరిస్థితులను చక్కది ద్దేందుకు గత నాలుగున్నరేళ్లుగా కేంద్రం తీసుకున్న చర్యలు విఫలం అయ్యేలా స్థానిక నేతలు, పాక్ ప్రేరేపిత సంస్థలు పనిచేస్తూ వచ్చాయి. తాజాగా మాజీ సిఎంల వ్యాఖ్యలు కూడా ఇందుకు నిదర్శనంగా చూడాలి.పాక్ ప్రత్యక్ష,పరోక్ష చర్యలతో కాశ్మీర్ శాంతిని అడ్డుకుంటోంది.ఈ దశలో ఇక గట్టి నిర్ణయంతో ముందుకు సాగడమే మంచిది.

పాక్ తీరును నమ్మడానికి లేదు. అందుకే ఇక ఈ సమస్యను తీవ్రంగానే గుర్తించి ఇదే అవకాశంగా పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను భారత్‌లో అంతర్భాగంగా చేసే యత్నాలు ఆరంభిం చాలి. మరోమారు కాశ్మీర్‌లో వేలుపెట్టకుండా పాక్‌కు గట్టి బుద్ధి చెప్పాలి. అలాగే కాశ్మీర్‌లో ఉగ్రమూకల ఏరివేతను మరింత సవాల్‌గా తీసుకోవాలి. అక్కడ ఉగ్రవాదులు కాలుపెట్టకుండా కఠినంగా వ్యవహరించాలి. ఉగ్రమూకలకు అండగా నిలుస్తున్న వారు ఎంతటి వారైనా బుద్ధి చెప్పాలి. స్థానికమప్రజల అండ లేకుండా చేయాలి. నాయకులైతే కోర్టు బోనులో నిలబెట్టాలి. మరింత ఉధృతంగా ఉగ్రవాదుల ఏరివేత ప్రారంభించాలి. వారికి ఆశ్రయం కల్పిస్తున్న వారిని గుర్తించి వారిని కూడా ఏరిపడే యాలి. పండిట్లు లేదా సామాన్య ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలి. వారికి అండగా నిలవాలి. అవసర మైన మేరకు భద్రత కల్పించాలి. అందుకు సంకల్పం తీసుకుని ముందుకు సాగాలి. ఈ విషయంలో రాజకీయాలను పట్టించుకోక పోవడం ఉచితం.

# రాజకీయాలకూ ఓ హద్దు ఉండాల్సిందే !

- **సుప్రీం నిర్ణయాన్ని తప్పు పట్టడం దారుణం**
- **న్యాయవ్యవస్థను రాజకీయాల్లోకి లాగరాదు**
- **కేజ్రీవాల్‌కు బెయిల్‌పై షా వ్యాఖ్యలు అనుచితం**

**న్యూఢిల్లి,మే17(పీపుల్స్ మోటివేషన్):**

జకీయాల్లో అధికారమే అంతిమ లక్ష్యంగా రాజకీయ పార్టీలు అన్నీ పని చేస్తున్నాయి. ఇందుకు ఏ పార్టీ కూడా అతీతం కాదు. విభిన్నంగా ఎదిగిన బిజెపి కూడా ఇప్పుడు అధికారమే లక్ష్యంగా పనిచేస్తోంది. అన్నా హజారే మద్దతులో అవినీతి వ్యతిరేకతే అంశంగా రాజకీయాల్లో అడుగు పెట్టిన ఢిల్లీ సిఎం కేజ్రీవాల్ కూడా తన మూలాలను మరచిపోయారు. అవినీతి కాంగ్రెస్ అంటూ విమర్శించిన కేజ్రీవాల్ ఇప్పుడు అదే కూటమి లో చేరిపోవడమే గాకుండా...ఇండియా కూటమి అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారు. అంతేకాదు లిక్కర్ కేసులో జైలుకు వెళ్లారు. కేజ్రీవాల్ చర్యలను ఇప్పుడు సామాజికవేత్త అన్నాహజారే కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అవినీతికి అంటకాగే వారిని పాలన నుంచి దూరం పెట్టాలని పిలుపు నిచ్చారు. అయినా కేజ్రీవాల్ తన పద్ధతిని మార్చుకోలేదు. తన సిద్ధాంతానికి విరుద్ధంగా అవినీతి పార్టీలతో జతకట్టారు. ఆయన సిఎం కావడానికి ఉపయోగపడ్డ అవినీతి రహిత విధానాలను పక్కన పెట్టారు. మోడీని ఢీకొట్టాలి..ప్రధాని పదవిని చేపట్టాలన్న దుర్మార్గపు ఆలోచనతో అవినీతి ఊబిలో ఇరుక్కుపోయారు. లిక్కర్ కేసులో పీకల్లోతు కూరుకుపోయి..తీహార్ జైలుకు వెళ్లారు. అంతకుముందు ఇడి విచారణను కూడా ధిక్కరించారు. అయితే మోడీ ఎప్పటినుంచో కేజ్రీవాల్‌ను బొక్కలేయడానికి చూస్తున్నారు. ఎక్కడ దొరుకుతారా అని చూస్తున్నారు. ఇక లిక్కర్ కేసులో దొరకడం ఆలస్యం ఇడిని ప్రయోగించి బొక్కలో వేయించారు. ఎన్నికల్లో ఎక్కడా ప్రచారం చేయకుండా పోయిన తరుణంలో సుప్రీం దయతో కేజ్రీవాల్ బయటకు వచ్చారు. జూన్ 1న తిరిగి జైలుకు వెళ్లాల్సి ఉంటుంది. ఇదంతా పూర్వ నేపథ్యం. ఇప్పుడు తాజాగా కొన్ని ఘటనలు చోటుచేసు కున్నాయి. కేజ్రీవాల్ జైలు నుంచి వచ్చాక ..ఓ కామెంట్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇక తాను జూన్1న తిరిగి జైలుకు వెళ్లాల్సిన అవసరం లేదని ప్రకటించారు. దీనిని తాజాగా ఇడి కూడా సుప్రీంలో సవాల్ చేసింది. అయితే ఈ వ్యాఖ్యలను పట్టించుకోబోమని కూడా సుప్రీం తేల్చింది. తాము అన్నీ ఆలోచించే బెయిల్ ఇచ్చామని చెప్పింది. ఇదే విషయంలో కేంద్ర హోంమత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు కూడా ఇప్పుడు దుమారం రేపుతున్నాయి. ఒకప్పుడు గుజరాత్‌లో మంత్రిగా ఉన్న వ్యక్తి మోడీతో కలసి దేశంలో ఇప్పుడు చక్రం తిప్పుతున్నారు. హోంమంత్రిగా ఉన్న అమిత్ షా కేజ్రీవాల్ విషయంలో చేసిన వ్యాఖ్యలను సుప్రీం కూడా తప్పుపట్టేలా వ్యాఖ్యలు చేసింది. అధికారం, పార్టీ బలం



చూసుకొని షా అదుపు లేకుండా మాట్లాడడం విస్మయానికి గురిచేస్తోంది. కేంద్రంలో బాధ్యత గల పదవిలో ఉంటూ దేశ ప్రధానికి కుడి భుజంగా పేరున్న అమిత్ షా ఏకంగా సుప్రీం కోర్టు ఆదేశాలు, తీర్పునే ప్రశ్నించే విధంగా మాట్లాడడం పట్ల న్యాయరంగ నిపుణులు కూడా విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సాక్షాత్తూ దేశ అత్యున్నత న్యాయస్థానం జారీ చేసిన ఆదేశాలపై అమిత్ షా అడ్డగోలుగా వ్యాఖ్యలు చేయడం ఆయన అధికార అహానికి నిదర్శనంగా ఉందనే వ్యాఖ్యలూ వెల్లువెత్తుతున్నాయి. మద్యం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజీవ్రాల్‌కు వచ్చే నెల ఒకటో తేదీ వరకు పలు రకాల షరతులతో న్యాయమూర్తులు ఈ బెయిల్ మంజూరు చేశారు. అయితే, సుప్రీంకోర్టు కేజీవ్రాల్ ని ప్రత్యేకంగా చూసిందని అమిత్ షా వ్యాఖ్యానించడం ఆశ్చర్యానికి గురిచేసింది. దేశానికి హోంశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్న నాయకుడు సుప్రీం ఆదేశాలను తప్పుపట్టే విధంగా మాట్లాడడం సమంజసం కాదనే అభిప్రాయాలు వస్తున్నాయి. ఢిల్లీ మద్యం కేసులో కొన్ని నెలలుగా చోటుచేసుకుంటున్న పరిణామాలు, తెర వెనుక రాజకీయ ఎత్తుగడలు దేశ ప్రజలకు తెలియని విషయం కాదని న్యాయ, రాజకీయ రంగ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికల సమయంలో కేజీవ్రాల్‌కు బెయిలు రావడంపై అమిత్ షాకు మింగుడు పడడం లేదనీ, అందుకే ఆయన అసహనాన్ని సుప్రీం కోర్టు తీర్పు పై వెళ్లగక్కుతున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో ఆప్ ఆధిపత్యాన్ని జీర్ణించుకోలేక అమిత్ షా సహనం కోల్పోయి మాట్లాడడం కేవలం అధికార అండతో బెదిరించడమే అనే విమర్శలూ వస్తున్నాయి. రాజకీయ నాయకులు ఇలా కోర్టు అనుమతులు, ఆదేశాలు, తీర్పుల వ్యవహారాల్లో జోక్యం చేసుకొని



న్యాయవ్యవస్థను చులకన పరిచే విధంగా మాట్లాడితే సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందనే వాదనలు తెరపైకి వస్తున్నాయి. అయితే ..ఢిల్లీ సీఎం అరవింద్ కేజీవ్రాల్‌కు తాత్కాలిక బెయిల్ మంజూరు చేసిన విషయంలో తామేమీ ప్రత్యేక మినహాయింపు ఇవ్వలేదని సుప్రీంకోర్టు పేర్కొంది. 'ఎవరికీ ఎలాంటి మినహాయింపు ఇవ్వలేదు. ఏది న్యాయసమ్మతమని భావించామో దానిని మేం మా తీర్పులో స్పష్టం చేశాం' అని తెలిపింది. తాత్కాలిక బెయిల్ అంశంలో కేజీవ్రాల్‌కు కోర్టు ప్రత్యేక ట్రీట్‌మెంట్ ఇచ్చిందని దేశంలో పలువురు భావిస్తున్నారంటూ కేంద్ర హోంమంత్రి, బీజేపీ కీలకనేత అమిత్‌షా చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో సుప్రీంకోర్టు ఈ విధంగా స్పందించింది. ఢిల్లీ మద్యం విధానం కేసులో ఈడీ తనను అరెస్టు చేయటాన్ని సవాల్ చేస్తూ కేజీవ్రాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ దింపకర్‌దత్తాలతో ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా కేజీవ్రాల్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. అమిత్‌షా పేరు ప్రస్తావించకుండా ఆయన చేసిన వ్యాఖ్యలను ఉదహరించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. తాము ఆ అంశంలోకి వెళ్లదల్చుకోలేదని చెబుతూనే, ఎవరికీ ఎలాంటి మినహాయింపు ఉండబోదని తెలిపింది. అయితే, తీర్పుపై విమర్శనాత్మక విశ్లేషణను తాము స్వాగతిస్తామని ధర్మాసనం పేర్కొనటం విశేషం. సుప్రీం కేజ్రీవాల్‌కు క్లీన్ చిట్ ఇవ్వలేదు. కేవలం తాత్కాలిక బెయిల్ మాత్రమే ఇచ్చింది. అదికూడా కేసులో ఉన్న మెరిట్స్‌ను పరిశీలించి మాత్రమే నిర్ణయం తీసుకుంది. దీనిపై రాజకీయాలు ఎలా ఉన్నా సుప్రీం నిర్ణయాన్ని తప్పుపట్టరాదు. అది అమిత్ షా కావచ్చు..మరెవరైనా కావచ్చు...ఇది గమనించాలి.

తెలుగు దినపత్రిక
# పీపుల్స్ మోటివేషన్
People's Motivation

శనివారం । మే । 18 । 2024

జనరల్ న్యూస్ 03



## టిడిపి సర్పంచ్ భర్త హనుమంత్ నాయక్ మృతి

**పాములపాడు, మే 17 (పీపుల్స్ మోటివేషన్):-**

పాములపాడు మండలం ఎర్ర గూడూరు గ్రామానికి చెందిన టిడిపి సర్పంచ్ మంగమ్మ బాయ్ భర్త హనుమంతు నాయక్ శుక్రవారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న నందికొట్కూరు టిడిపి సీనియర్ నాయకుడు గౌరు వెంకటరెడ్డి, నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గిత్త జయ సూర్య ఎర్ర గూడూరు గ్రామం చేరుకొని హనుమంతు నాయక్ భౌతిక కాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. తదనంతరం వారు మాట్లాడుతూ కుటుంబ సభ్యులకు పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల క్లస్టర్ హరినాద్ రెడ్డి, పలుచాని మహేశ్వర్ రెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, గ్రామ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## బాసటగా నిలుస్తున్న భరోసా కేంద్రం

**వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**

**వరంగల్,మే17(పీపుల్స్ మోటివేషన్):**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ భరోసా కేంద్రం లైంగిక దాడులకు గురైన బాధితులను అక్కున చేర్చుకోని వారికి అండగా నిలుస్తోందని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నమోదైన లైంగిక దాడుల కేసుల్లో బాధితులు వైద్య, వసతి, ఆర్థిక, న్యాయపరంగా సహకారం అందిస్తున్న భరోసా కేంద్రంలో ఈ కేసుల్లోని నిందితులకు శిక్షలు పడేవిధంగా భరోసా కేంద్రం అధికారులు, సిబ్బంది పనితీరును అభినందిస్తూ తెలంగాణ మహిళా భద్రత విభాగం అడిషినల్ డైరక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ షీకాగోయెల్ ప్రశంస పత్రాలను జారీచేసారు. వరంగల్ పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా భరోసా కేంద్రం అధికారులు, సిబ్బందికి దీనిని అందజేసారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ముందుగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ భరోసా కేంద్రం సిబ్బందిని అభినందించారు. లైంగిక దాడులకు పాల్పడిన నిందితులకు శిక్షలు పడటంలో భరోసా కేంద్రం సిబ్బంది పనితీరు అభినందనీయమని, ఈ కేంద్రం సిబ్బంది ఇప్పటి వరకు 24కేసుల్లో బాధితులకు బాసటగా నిలవడంతో పాటు నిందితులకు కోర్టు శిక్షలు విధించడంలో కీలకంగా నిలిచారు. అలాగే 335 బాధితులకు మొత్తం కలిపి ఒక కోటి ఇరువై లక్షల రూపాయలను పరిహారం క్రింద అందజేయడంతో పాటు మరో ఎనిమిది మందికి మొత్తం 14 లక్షల16 వేల రూపాయలను పరిహారాన్ని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటి అందజేసారని పోలీస్ కమిషనర్ తెలిపారు. ప్రశంస పత్రాలు అందుకున్న వారిలో భరోసా కేంద్రం ఇన్స్పెక్టర్ సువర్ణ, ఎస్.ఐ శ్రావణి, ఇతర సిబ్బంది నీరజ, నవ్య, సాగరిక, సుమలత,రజిత,పవిత్ర, మౌనిక వున్నారు.

## హనుమకొండ డిటిడిఓ ప్రేమకళ రెడ్డి అవినీతి

**అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలి**

**ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందచేత**

**వరంగల్,మే17(పీపుల్స్ మోటివేషన్):**

గిరిజన అభివృద్ధి అధికారి ప్రేమకళ అవినీతి అక్రమాలపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్ నర్సింహారెడ్డికి మెమోరండం ఇవ్వడం జరిగింది. సందర్భంగా అజ్మీర వెంకట్ మాట్లాడుతూ హనుమకొండ జనగామ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ప్రేమ కళ గత మూడు సంవత్సరాల క్రితం వచ్చినప్పటినుండి గిరిజన సంక్షేమ శాఖను భ్రష్టు పట్టించిందన్నారు. అక్రమార్జనే ధ్యేయంగా పనిచేస్తూ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీస్ దగ్గర నుండి మధ్యవర్తి ఒక వార్డెన్ ద్వారా లక్షల రూపాయలు వసూలు చేస్తూ, ఇబ్బందులకు గురి చేస్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. జనగామ హన్మకొండ జిల్లాలో పనిచేస్తున్నటువంటి ఒక్కొక్క వార్డులకు రెండు మూడు హాస్టల్లో ఇన్చార్జి బాధ్యతలు అప్పగిస్తూ వారి దగ్గర నుండి హాస్టల్ లో ప్రతినెల డైట్ బిల్స్ లో 20శాతం తీసుకొని పిల్లల హాజరు శాతం 100 వేసుకోండి అని వార్డెన్లకు చెపుతూ కోట్ల రూపాయలు అక్రమంగా సంపాదించినట్లు ఆరోపించారు. అలాంటి ప్రేమకళ పై ఏసీబీ విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా కొంతమంది వార్డెన్లను ప్రిన్సిపాల్ లను హనుమకొండ లో ఉన్న డి టి డి ఓ ఆఫీస్ లో ఖాళీగా కూర్చోబెట్టి జీతాలు ఇస్తున్నారు. అన్ని అంశాలపై సమగ్రమైన విచారణ జరిపించాలని ప్రేమకళపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసారు. లేని పక్షంలో ఎన్ హెచ్ పి హెచ్ ఆధ్వర్యంలో దశలవారీగా పోరాటాలు ఆందోళనలు చేపడతామని హెచ్చరిక చేసారు.

## గ్రూప్-4 ఉద్యోగాల భర్తీ..

**త్వరలో సర్టిఫికెట్ వెరిఫికేషన్**

**హైదరాబాద్,మే17(పీపుల్స్ మోటివేషన్):**

గ్రూప్-4 ఉద్యోగాల భర్తీకి సంబంధించి త్వరలోనే సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ వెల్లడించింది. జనరల్ ర్యాంకింగ్ జాబితాను ఈ ఏడాది ఫిబ్రవరి 9వ తేదీన టీఎస్‌పీఎస్సీ విడుదల చేసిన సంగతి తెలిసిందే. జనరల్ అభ్యర్థులను 1:3 నిష్పత్తిలో, పీడబ్ల్యూడీ అభ్యర్థులను 1:5 నిష్పత్తిలో పిలవనున్నారు. కమ్యూనిటీ, నాన్ క్రిమి లేయర్(బీసీలకు), పీడబ్ల్యూడీ సర్టిఫికెట్స్, స్టడీ లేదా రెసిడెన్స్ సర్టిఫికెట్స్(క్లాస్ 1 నుంచి ఏడు వరకు), రిజర్వేషన్ కలిగి ఉంటే దానికి సంబంధించి డాక్యుమెంట్లు, ఏజ్ రిలాక్సేషన్, క్వాలిఫికేషన్ సర్టిఫికెట్లు రెడీగా ఉంచుకోవాలని టీఎస్‌పీఎస్సీ సూచించింది. సర్టిఫికెట్ వెరిఫికేషన్ సమయంలో వీటిలో ఏ డాక్యుమెంట్ సమర్పించకపోయినా ఆ అభ్యర్థులను పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టం చేసింది.

## స్థానిక సమరంపై నేతల వ్యూహం

**వర్గపోరు లేకుండా కాంగ్రెస్ కసరత్తు**

**ఉమ్మడి జిల్లాలో 1,740 జీపీలు, 72 మండలాలు**

**వరంగల్,మే17(పీపుల్స్ మోటివేషన్) :**

పార్లమెంట్ఎన్నికల పోలింగ్ ముగియడంతో ఇక అందరి దృష్టి స్థానిక సమరంపై పడింది. జూన్‌లో ఎంపీ ఎన్నికల ఫలితాలు వచ్చాక స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించి అన్ని జిల్లాల్లో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎన్నికల మెటీరియల్, అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,740 గ్రామ పంచాయతీలు, 72 మండలాలు ఉన్నాయి. ఇప్పుడున్న రిజర్వేషన్ల ప్రకారంగానే ఎన్నికలు జరుగుతాయని ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది. కొత్త చట్టం ప్రకారం రెండు టర్మ్‌ల వరకు ఒకటే రిజర్వేషన్లు ఖరారు చేశారు. మొదటి టర్మ్‌కు సంబంధించి ఫిబ్రవరిలో పంచాయతీల పాలన ముగియగా, జూలైలో జిల్లా పరిషత్ల పాలకవర్గాల పదవీ కాలం ముగుస్తుంది. కాబట్టి జూన్‌లో ఎన్నికల నోటిఫికేషన్ రానుంది. పంచాయతీ వార్డులు మొదలు జడ్పీ చైర్మన్ స్థానం వరకు ఇప్పుడున్న రిజర్వేషన్లే యథావిధిగా కొనసాగనున్నాయి. అయితే, అసెంబ్లీ ఎన్నికల టైంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్తగా కొన్ని మండలాలు ప్రకటించింది. వీటి విషయంలో కాంగ్రెస్ సర్కార్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది. ఇవి మినహా ఇతర స్థానాల రిజర్వేషన్లలో ఎలాంటి మార్పు ఉండదు. నేరుగా ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసి, వారం, పదిరోజు ల్లో ఎన్నికల ప్రచారం, నామినేషన్ల ప్రక్రియ ముగించాలని భావిస్తోంది. ముందుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించి, కొద్ది రోజుల తేడాతో సర్పంచ్ఎన్నికలు నిర్వహిస్తే రాజకీయంగా ఎలాంటి సమస్యలు ఉండవని ప్రభుత్వం ఆలోచన చేస్తోందని అధికారులు చెబుతున్నారు. దీని వల్ల మెజార్టీ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకోవడమే కాకుండా వలసొచ్చిన నేతలతో వర్గపోరు తలెత్తకుండా ఉంటుందని జిల్లా మంత్రులు అభిప్రాయపడుతున్నారు. కష్టపడ్డ నేతలకే లోకల్‌బాడీ ఎన్నికల్లో ప్రియార్టీ ఇచ్చేందుకు జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి ఇప్పటికే బంపర్ఆఫర్ ప్రకటించారు. ఎంపీ ఎన్నికల్లో మెజార్టీ సాధించి పెట్టిన స్థానిక లీడర్లకే ప్రాధాన్యత ఇస్తామన్నారు. పైగా వాళ్ల ఎన్నికల ఖర్చు కూడా తానే భరిస్తానని హామీ ఇచ్చారు. దీంతో ఎంపీ ఎన్నికల్లో జడ్పీ చైర్మన్, జడ్పీటీసీ, సర్పంచ్ పదవులపై ఆశలు పెట్టుకున్న వారంతా ఎంపీ ఎన్నికల్లో కష్టపడ్డారు. నల్గొండ నియోజకవర్గంలోని తిప్పర్తి మండలంలో 80 శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. ఇక్కడి నుంచే ప్రస్తుత జడ్పీటీసీ పాశం రాంరెడ్డి వచ్చేసారి జడ్పీ చైర్మన్ సీటు ఆశిస్తున్నారు. దీనిలో భాగంగానే తిప్పర్తి క్లాక్ టవర్ జంక్షన్అభివృద్ధికి రూ.5 కోట్ల నిధులు కూడా మంజూరు చేయించారు. అదే విధంగా కనగల్మండల జంక్షన్ అభివృద్ధికి మరో రూ.5 కోట్లు మంత్రి కోమటిరెడ్డి మంజూరు చేయించారు. ఇలా లోకల్బాడీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తిరుగులేకుండా ఉండేందుకే ఇప్పటి నుంచే అభివృద్ధి పనులపైనే ఫోకస్ పెట్టారు. ఎంపీ ఎన్నికల్లో డబుల్ డిజిట్ స్థానాలు కైవసం చేసుకుంటామని కాంగ్రెస్ పార్టీ ధీమా వ్యక్తం చేస్తోంది. అదే జోష్తో స్థానిక ఎన్నికలు నిర్వహిస్తే మళ్లీ ఐదేళ్ల వరకు ఎన్నికలు ఉండవని భావిస్తోంది. ఈ ఏడాది చివరి నాటికి మున్సిపాలిటీ, సహకార సంఘాల ఎన్నికలు కూడా పూర్తవుతాయి. అంతకంటే ముందే జరిగే గ్రామ పంచాయతీ, జిల్లా పరిషత్ ఎన్నికలను కాంగ్రెస్ పక్కాగా ప్లాన్ చేస్తోంది. అసెంబ్లీ, పార్లమెంట్ఎన్నికల టైంలో బీఆర్ఎస్ నుంచి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరారు. వీళ్లలో చాలా మంది పాత కాంగ్రెస్ లీడర్లతోపాటు కొత్తగా బీఆర్ఎస్ నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధులూ ఉన్నారు. వలసనేతలు, కరుడుగట్టిన కాంగ్రెస్ లీడర్ల మధ్య స్థానిక ఎన్నికల్లో విభేదాలు తలెత్తకుండా ఇప్పటినుంచే జాగ్రత్త పడుతున్నారు. పంచాయతీ, జడ్పీ ఎన్నికలకు కలిపి ఒకటే సారి ఎన్నికల నోటిఫికేషన్ ఇస్తే ప్రత్యర్థులకు ఛాన్స్ ఉండదని, పైగా లోకల్‌బాడీలను హస్తగతం చేసుకునేందుకు మార్గం సులువుగా ఉంటుందని కాంగ్రెస్ భావిస్తోంది.

## ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ హాల్‌టిక్కెట్ల విడుదల

**హైదరాబాద్,మే17(పీపుల్స్ మోటివేషన్):**

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24 నుంచి ప్రారంభం కానున్నాయి. జూన్ 3వ తేదీ వరకు పరీక్షలను నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి మ. 12 గంటల వరకు ఫస్టియర్ విద్యార్థులకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు సెకండియర్ విద్యార్థులకు పరీక్షలను నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేసింది. సప్లిమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థులు నేరుగా ఇంటర్ బోర్డు వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. హాల్ టికెట్ డౌన్ లోడ్ చేసుకున్న తర్వాత విద్యార్థులు తమ ఫొటో, సంతకం, పేరు, మీడియంతో పాటు ఏయే సబ్జెక్టులు రాస్తున్నామో వాటిని గమనించాలి. వాటిలో ఏవైనా తప్పులు ఉంటే తక్షణమే సంబంధిత కాలేజీ ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలి. హాల్ టికెట్లపై ప్రిన్సిపాల్స్ సంతకాలు లేకపోయినప్పటికీ పరీక్ష రాసేందుకు అనుమతించాలని ఇంటర్ బోర్డు చీఫ్ సూపరింటెండెంట్లకు ఆదేశాలు జారీ చేసింది.

## సబ్ జైల్ తనిఖీ చేసిన ఆదోని ఇన్చార్జ్ జిల్లా అడిషనల్ జడ్జి భూపాల్ రెడ్డి



**పత్తికొండ, మే 17 (పీపుల్స్ మోటివేషన్):-**

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఆదోని జిల్లా సెకండ్ అడిషనల్ ఇన్చార్జి జడ్జి భూపాల్ రెడ్డి పత్తికొండ సబ్ జైల్ ను తనిఖీ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం ఆయనలో సబ్ జైల్లో కారాగారం పరిశీలించి,ఖైదీలకు అందుతున్న ఆహారం, వంటగదిని తనిఖీ నిర్వహించారు. అనంతరం ఖైదీలతో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సత్ప్రవర్తనతో మంచి జీవితం గడపాలని వారికి సూచించారు. కార్యక్రమంలో పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి ఎమ్మెస్ భారతి, సబ్ జైల్ సూపరిండెంట్ చంద్రమోహన్, లోకదాల క్లర్క్ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు. సబ్ జైలు తనిఖీ అనంతరం ఆయన పత్తికొండ సాయిబాబా దేవాలయం చేరుకుని అక్కడ పూజలు నిర్వహించారు.


## ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి : ఏఐఎస్ఎఫ్




**డోన్, మే 17 (పీపుల్స్ మోటివేషన్):-**

డోన్ పట్టణంలో ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న కార్పొరేట్ విద్యా సంస్థలైన శ్రీ చైతన్య, నారాయణ, శ్రీ సుధా కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సూర్య ప్రతాప్ శుక్రవారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికల హడావిడి ఉండగా ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల బుద్ధి నిరూపించుకుంటున్నాయని వీటి పైన అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా మడుపులు తీసుకొని ప్రవేట్ కార్పోరేట్ విద్యాసంస్థలను గాలికి వదిలేశారు అని అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభం కాకముందే ప్రైవేటు విద్యాసంస్థలు కలర్ కలర్ పత్రాలు , ఫ్లెక్సీలు తయారు చేసుకుని ఆ విద్యాసంస్థలలో పనిచేసే ఉపాధ్యాయులకు మీరు అడ్మిషన్లు తీసుకుని రాకుంటే మీకు జీతాలు ఇవ్వమని బెదిరిస్తూ వారిని గ్రామాల చుట్టూ తిప్పుతూ ముందస్తు అడ్మిషన్స్ నిర్వహించుకుంటూ ఇప్పుడు జరిగితే ఒక ఫీజు పాఠశాల ప్రారంభించిన తర్వాత చేరితే మరొక ఫీజు ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తూ దోపిడీ చేస్తున్నారని ఆయన తెలిపారు. అనంతరం పాఠ్యపుస్తకాల అమ్ముకుంటూ ఆర్థిక దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి వారి పై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కళాశాలల ఎదుట ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఎఫ్ కార్యవర్గ సభ్యులు మనోజ్, శశిధర్ రెడ్డి, వంశీ, ఈశ్వర్, సిద్ధార్థ, సురేంద్ర , ధర్మతేజ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబును కలిసిన టి.జి భరత్



**కర్నూలు, మే 17 (పీపుల్స్ మోటివేషన్):-**

తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి టి.జి భరత్ కలిశారు. చంద్రబాబును కలిసి ఎన్నికల పోలింగ్ గురించి చర్చించినట్లు టి.జి భరత్ చెప్పారు. ఈ సందర్భంగా కర్నూలు నియోజకవర్గంలో పోలింగ్ శాతం పెరిగేలా కృషి చేసినట్లు చంద్రబాబుకు వివరించినట్లు తెలిపారు. రాష్ట్రంలో కూటమి అధికారం చేపట్టబోతుందని చంద్రబాబు నాయుడు చెప్పారని టి.జి భరత్ అన్నారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

# బ్లడ్ ప్రెషర్ సైలెంట్ కిల్లర్

**రక్తపోటును అదుపులో పెట్టుకోవాలి!**

**మే17 ప్రపంచ రక్తపోటు దినోత్సవం**

**హైదరాబాద్,మే17(పీపుల్స్ మోటివేషన్):**

మే 17ను ప్రపంచ రక్తపోటు దినోత్సవంగా గుర్తించబడింది. 2006 నుండి ప్రపంచ రక్తపోటు దినంగా పాటిస్తూ ఆరోగ్య జాగ్రత్తలను సూచిస్తున్నారు. హైపర్‌టెన్షన్ మరియు దాని పర్యవసానాల గురించి అవగాహన కల్పించడానికి ఇది ఎంతగానో దోహదపడుతోంది. రక్తపోటును ఖచ్చితంగా కొలవండి, దానిని నియంత్రించండి, ఎక్కువ కాలం జీవించండన్న వైద్యుల సూచనలు పాటిస్తే మంచిది. ఆరోగ్యవంతుడైన మానవుని సాధారణ రక్తపీడనం (బిపి) 120/80 ఉండాలి. ఇది 140/90 కంటే ఎక్కువైతే అధిక రక్తపోటు లేదా అధిక రక్తపీడనం హై బిపి గాను, 90/60 కంటే తక్కువైతే అల్ప రక్తపోటు లేదా అల్ప రక్తపీడనం లో బిపి)గాను అంటారు. ఈ రెండు ప్రమాదకరమైనవే. దీనిలో 120 అనేది సిస్టోలిక్ పీడనాన్ని, 80 అనేది డయాస్టోలిక్ పీడనాన్ని తెలియజేస్తుంది.హృదయం సంకోచాన్ని సిస్టోల్ అంటారు. హృదయం సడలికను డయాస్టోల్ అంటారు. రక్తపోటు వ్యాధి లక్షణాలు ఎట్టిపరిస్థితుల్లోను బయటపడవు. కాబట్టి దీనిని నిశ్శబ్ద కిల్లర్ అని పిలుస్తారు. హైపర్‌టెన్షన్ లేదా హై బ్లడ్ ప్రెజర్ అనేది సైలెంట్ కిల్లర్. శరీరంలోని దాదాపు ప్రతి అవయవాన్ని ప్రభావితం చేస్తుంది. ఉదాహరణకు, హైపర్‌టెన్షన్ మూత్రపిండాలను ప్రభావితం చేస్తుంది, స్ట్రోక్‌లు, తదుపరి పక్షవాతం ఏర్పడవచ్చు, జఠరికల విస్తరణకు దారితీయవచ్చు. రెటీనాపై కూడా ప్రభావం చూపుతుంది. భారతదేశంలో, కార్డియోవాస్కులర్ డిసీజ్ మరణానికి ప్రధాన కారణం, అధిక రక్తపోటు కారణం. భారతీయ జనాభాలో హైపర్‌టెన్షన్‌తో బాధపడుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. 2005లో 20.6 శాతం భారతీయ పురుషులు మరియు 20.9శాతం భారతీయ స్త్రీలు బాధపడుతున్నారని అంచనా వేయబడింది. ఈ సంఖ్య 22.9 నాటికి భారతీయ పురుషులు, స్త్రీలలో 23.6 మరియు 2025కి పెరుగుతుందని అంచనా వేయబడింది. చికిత్స పొందిన రోగులలో 25.6శాతం మంది మాత్రమే వారి బిపి నియంత్రణలో ఉండటం ఆందోళనకు అత్యంత ముఖ్యమైన కారణం. అవగాహన లేకపోవడమే అత్యంత ముఖ్యమైన ప్రమాదం. వివిధ మందులను ట్రైట్రేట్ చేయడం ద్వారా రక్తపోటును నియంత్రణలో ఉంచడం నిరంతర పర్యవేక్షణ ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. ఇది హైపర్‌టెన్షన్ హైపర్‌టెన్షన్ కారణంగా భవిష్యత్తులో సంభవించే ఏదైనా తీవ్రమైన వ్యాధులను ముందస్తుగా నిరోధిస్తుంది.

# మానవత్వం మరచిన తనయులు

**ఆస్తి పంపకాల్లో తేడాతో రెండ్రోజులు**

**తల్లి దహన సంస్కారాలు నిలిపివేత**

**చివరకు పంచాయితీ తెగడంతో దహనం**

**సూర్యాపేట జిల్లాలో కలచివేసిన ఘటన**

**సూర్యాపేట,మే17(పీపుల్స్ మోటివేషన్):**

మానవత్వం మంట కలిసిపోతుంది. మానవ సంబంధాలు, విలువలు రోజురోజుకు దిగజారుతూ అంతరించిపోతున్నాయి. కుటుంబ సభ్యుల మధ్య ఒకప్పుడు ప్రేమానురాగాలు ఉండేవి. రాను రాను డబ్బుపై వ్యామోహం పెరిగి బంధుత్వాలు తగ్గుకుంటూ వస్తున్నాయి. ఆస్తి పాస్తులు ఉంటే చాలు తల్లిదండ్రులు కూడా అవసరం లేదని రుజువు చేస్తున్న ఘటనలు చూస్తున్నాం. తల్లిదండ్రులు తమ బిడ్డలను ఎంతో ప్రేమానురాగాలతో పెంచి పెద్ద చేస్తారు. కానీ చివరికి అలాంటి తల్లిదండ్రులని పట్టించుకోని దీన స్థితి నెలకొంది. బంగారం, డబ్బుల కోసం చివరకు చనిపోయిన తల్లి అంత్యక్రియలు నిర్వహించకుండా రెండు రోజులు రోజులు ఆపిన ఘటన సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలంలోని కందులవారి గూడెం గ్రామంలో వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

కందులవారిగూడేనికి చెందిన వేము వెంకటరెడ్డి, లక్ష్మమ్మ (80) దంపతులకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలున్నారు. గతంలోనే లక్ష్మమ్మ భర్త వెంకటరెడ్డి, చిన్న కుమారుడు కూడా చనిపోయారు . దీంతో నేరేడుచర్లలో ఉంటున్న చిన్న కుమార్తె వద్ద గత ఐదేళ్లుగా లక్ష్మమ్మ ఉంటుంది. లక్ష్మమ్మ ఇటీవల కాలు జారి కింద పడింది. దాంతో ఆమెను మిర్యాలగూడలోని ఓ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు . ఆమె పరిస్థితి విషమించడంతో ఇంటికి తీసుకెళ్లండని డాక్టర్లు సూచించారు. దీంతో లక్ష్మమ్మను ఆక్సిజన్ సపోర్ట్‌తో చిన్నకుమార్తె తన ఇంటికి తీసుకెళ్లింది. బుధవారం రాత్రి 9 గంటలకు ఇంటి ముందు ఉన్న వెంచర్ వద్ద అంబులెన్స్ వచ్చి ఆగింది. ఈలోగా లక్ష్మమ్మ కుమారుడు అక్కడికి చేరుకుని.. పెద్దమనుషులతో పంచాయితీ పెట్టించారు. లక్ష్మమ్మను కందులవారిగూడెం తీసుకెళ్తానని చెప్పడంతో.. మిగతా కూతుళ్లు ఆస్తి పంపకాలు తేలే వరకు అంబులెన్స్ కదిలేది లేదని పట్టుపట్టారు. చివరకు రాత్రి 11 గంటల సమయంలో లక్ష్మమ్మ కన్నుమూశారు. మృతదేహాన్ని కందులవారిగూడెం తరలించినా కొడుకు కూతుళ్ల పంచాయితీ మాత్రం ఆగలేదు. లక్ష్మమ్మ గతంలో రూ.21 లక్షల వరకు పలువురికి అప్పులిచ్చారు. ఆమె ఒంటిపై 20 తులాల బంగారు ఆభరణాలున్నాయి. అయితే లక్ష్మమ్మ వైద్య ఖర్చులు భరించిన చిన్నకూతురికి రూ.21 లక్షల్లోంచి రూ.6 లక్షలు ఇవ్వాలని ఒప్పందం చేసుకున్నారు. మిగిలిన రూ.15 లక్షలకు సంబంధించిన పేపర్లను కుమారుడికి అప్పజెప్పారు. 20 తులాల బంగారు ఆభరణాలను ముగ్గురు కూతుళ్లు పంచుకున్నారు. అంతా అయిపోయిందిలే అనుకుంటున్నా సమయంలోనే కుమారుడు కొత్త పేచీ పెట్టాడు. తాను అంత్యక్రియల ఖర్చు భరించలేనని, తనకు డబ్బులిస్తేనే తలకొరివి పెడతానన్నాడు. శుక్రవారం ఉదయం పెద్ద మనుషులు అంత్యక్రియల ఖర్చుకు రెండు లక్షలు ఇప్పియడంతో ఆ పంచాయితీ కొలిక్కి వచ్చింది. తర్వాత ఆమె అంత్యక్రియలను నిర్వహించారు.

# కాశ్మీర్‌లో రాజకీయ డ్రామాలను కట్టిపెట్టాలి

- **పాక్ దుశ్చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి**
- **వలస వెళ్లిన పండిట్లకు భరోసా కల్పించాలి**

**న్యూఢిల్లీ,మే17(పీపుల్స్ మోటివేషన్):**

బిజెపిని అప్రతిష్టపాలు చేయడమే లక్ష్యంగా అక్కడి నేతలు ఇంతకాలం చేసిన రాజకీయ డ్రామాలకు తెరపడడం లేదు. ఎందుకంటే 370 ముసుగులో రాచరికం అనుభవించిన నేతలు ఇప్పుడు అక్కడ ప్రజలు స్వే÷–ఛా వాయువులు పీల్చుకోవడం జీర్ణించుకోవడం లేదు. అందరు కాకున్నా కొందరికి ఈ చర్య గిట్టుబాటు కాని వ్యయహారంగా కూడా ఉంది. అలాగే ఏకపక్ష రాజకీయం లేకుండా చేసింది. కేంద్రం తీసుకుంటున్న శాంతి చర్యలకు ఇంతకాలం మెహబూబా ముఫ్తీ కూడా గండికొట్టారు. పూర్తి పాక్ అనుకూల విధానాలను నరనరాన జీర్ణించుకున్న హురియత్ నేతలు కాశ్మీర్‌లో శాంతి స్థాపనకు కేంద్రం చేసిన యత్నాలను ఆదినుంచీ గండికొట్టారు.అక్కడ 370 ఆర్టికల్‌ను అడ్డం పెట్టుకుని ఇంతకాలం హురియత్ నేతలకు తోడు మెహబూబా ముఫ్తీ, అబ్దుల్లాలు పాక్‌తో కలసి దేశ విద్రోహ చర్యలకు పాల్పడుతూ వచ్చారు. ప్రజలను రెచ్చగొడుతూ యువతను పక్కదారి పట్టించారు. అక్కడి ముఫ్తీలు,అబ్దుల్లాలే ఒక్కరే కాశ్మీర్ ప్రజలు కాదని గుర్తుంచు కోవాలి. 370 రద్దుతో హురియత్ నేతలకు స్థానం లేకుండ పోయింది. అలాగే అక్కడి నుంచి తరిమివేయబడ్డ వేలాది కాశ్మీర్ పండిట్లతో కూడా సమస్యలు చర్చించడం ద్వారా వారిలో ధైర్యం కల్పించాలి. కాశ్మీర్‌లో అసలు జరుగుతున్నదేమిటో ప్రపంచానికి తెలిసింది. నిజానికి పండింట్లను ముందుగా వారిని తమ స్వస్థలాలకు పంపి రక్షణ కల్పించాలి. కనీస మర్యాద, గౌరవం లేకుండా తామేదో ఇతర దేశస్థుల మాదిరిగా ఇంతకాలం నేతలు వ్యవహరిస్తూ వచ్చారు. ఇంతకాలం వారి పెడధోరణికి నిదర్శనంగా గుర్తుంచుకోవాలి. విచ్ఛిన్నకర ధోరణితో కాశ్మీర్‌లో మరింత ఆజ్యం పోస్తూ వచ్చారు. వారంతా కావాలని పాక్ కొమ్ముకాస్తూ భారత్‌లో వేర్పాటు వాద కార్యకలాపాలకు మద్దతు పలికారు. వీరంతా తాము అనుకున్న రీతిలో కాశ్మీర్ నడవాలని అనుకున్నారు. పాక్ వీరికి భారత్ వ్యతిరేక ఉగ్రవాదాన్ని నూరిపోస్తోంది. 370 ఆర్టికల్ కాశ్మీర్ అభివృద్ధికి అడ్డుగా నిలవడమే గాకుండా కాశ్మీరీ పండింట్లకు చోటులేకుండా చేసింది. దీనిరద్దుతో ఇప్పుడు పండిట్లు తమ స్వస్థలాలకు చేరుకునే అవకాశం వచ్చింది. అలాగే మెల్లగా ఇక్కడినుంచి తరలి వెళ్లిన వారు కూడా వచ్చేస్తున్నారు. ఇది జీర్ణించుకోలేని ఉగ్రమూకలు పండిట్లను మళ్లీ లక్ష్యంగా చేసుకుని కాల్పులకు తెగబడుతున్నారు. ముందు పండిట్లను కాశ్మీర్‌లో స్వేచ్ఛగా జీవించే చర్యలు తీసుకోవాలి. అలా చేస్తేనే కాశ్మీర్ అందరిదన్న భావన ఉంటుంది. కాశ్మీరీ పండిట్లను జాడ లేకుండా తరిమేసినా గత ప్రభుత్వాలు ఏనాడూ అక్కడ నివారణ చర్యలు తీసుకుని అక్కడి ప్రజలను భారత్‌తో మమేకం చేయలేకపోయింది. రాజకీయ పార్టీలు కూడా ఇలాంటి విషయాల్లో ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తూ వచ్చాయి. బిజెపి కఠినంగా వ్యవహరించి సమస్యను పరిష్కరిం చడంలో చొరవ తీసుకున్న దానిని విఫలం చేశారు. పాక్ పాలకులతో స్నేహం పెంచుకోవడం ద్వారా తీవ్రవాద గ్రూపులు కాశ్మీర్‌ను నిత్యం కల్లోల క్షేత్రంగా రగిలిస్తూనే ఉన్నారు. అందువల్ల ముందుగా కాశ్మీర్ నుంచి తరిమివేయబడ్డ పండిట్లను ఇతర ప్రాంత ప్రజలను విశ్వాసంలోకి తీసుకోవాలి. అలా చికిత్సకు శ్రీకారం చుట్టాలి. అప్పుడే మిగతా వర్గాల ప్రజలు కూడా విశ్వాసంలోకి తీసుకునే ప్రయత్నం చేయాలి. ఇందుకోసం కొంత కఠిన వైఖరినే కేంద్రం అవలంబించాలి. ఇక్కడ శాంతి కోసం చేసే ప్రతి ప్రయత్నాన్నీ ఇక్కడ తీవ్రవాదులు ఎగదోస్తూ చిచ్చు రేపుతున్నారు. రాజకీయ లబ్ధికి వీటిని ఉపయోగించుకుంటున్న నేపథ్యంలో అందుకు తగ్గట్లుగా వ్యూహాలు ఉండాలి. నరేంద్రమోదీ ప్రభుత్వం కాశ్మీర్ సమస్య, కాశ్మీర్ పట్ల వివేకవంతమైన వైఖరితో ముందుకు వెళ్లడం స్వాగతించాలి. ప్రధాని మోడీ ప్రయత్నాలు ఫలించాలంటే ప్రతిపక్షం కూడా ఆయనకు బాసటగా ఉండాలి. అయితే పక్కలో బల్లెంలా ఉన్న పాక్ పాలకులు కాశ్మీర్‌లో ఆజ్యం పోస్తూ ఉగ్రవాదులను ఎగదోస్తున్నారు. భారత్‌లో అలజడి సృష్టించేందుకు పాక్ చేస్తున్న ప్రయత్నాలు ఈ నాటివి కాదు. భారత్ నుంచి విడివడ్డ నాటి నుంచి అంటే 1947 నుంచి కుట్రలు పన్నుతూనే ఉంది. సరిహద్దుల్లో ఉద్రిక్తతలు సృష్టించి తీవ్రవాదులను దేశం దాటించాలని అక్కడి సైన్యం చూస్తోంది. సరిహద్దుల్లో తీవ్రవాదలును చొప్పించేందుకు సిద్దంగా ఉన్న పాక్ సైన్యం కాల్పుల ద్వారా తరచూ దృష్టి మరల్చేందుకు ప్రయత్నాలు చేస్తోంది. సరిహద్దులో పాకిస్థాన్ పదేపదే కాల్పులకు తెగబడుతున్న తీరు దాని కుత్సిత బుద్ధికి నిదర్శనంగా చెప్పుకోవాలి. పాక్‌కు మాటలతో సమాధానం చెప్పలేమని గతానుభవాలను బట్టి తెలుసుకోవాలి. పాక్‌లో అంతర్గ సంక్షోభాలు వచ్చినప్పుడల్లా ఇలా భార్‌తపైకి దాడులకు దిగుతారు. పాకిస్తాన్ ప్రజలను రెచ్చగొట్టేందుకే కాశ్మీర్ విషయంలో ఎప్పుడూ వివాదం సృష్టిస్తూనే ఉంటారు. ఆక్రమిత కాశ్మీర్ ఇప్పటికీ ఈ సమస్య రాజుకుంటూనే ఉంది. దౌత్య పరంగా తప్పటడుగుల వేయడంతో భారత్‌కు తిప్పలు తప్పలేదు. ఇప్పటికైనా మోడీ దీని పరిష్కారాన్ని చేతల్లోకి తీసుకోవడం ద్వారా శాశ్వత పరిష్కారానికి తెగువ చూపారు.

# ఇన్సూరెన్స్ డబ్బుల కోసం కోడలు దారుణం

**అత్తా, భర్తలను దుండగులతో చంపించే చత్నం**

**హైదరాబాద్,మే17(పీపుల్స్ మోటివేషన్):**

ఇన్సూరెన్స్ డబ్బుల కోసం ఓ మహిళ తన భర్త, అత్తపైనే హత్యాయత్నానికి పాల్పడింది. ఈ దారుణ ఘటన బేగంబజార్‌లో కలకలం రేపింది. బేగంబజార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కట్టెలమండి సమీపంలో ఓ కోడలు తన బంధువులతో.. భర్త, అత్తపై దాడి చేయించింది. ఇంట్లోకి చొరబడిన దుండగులు విచక్షణా రహితంగా వారిపై దాడికి పాల్పడ్డారు. అత్తను చంపేస్తే బీమా సొమ్ము వస్తుందని కోడలు ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. స్థానికులు చూస్తుండగానే దుండగులు.. భర్త, అత్తలపై కత్తులు, కర్రలతో విచక్షణా రహితంగా దాడి చేశారు. డయల్ 100కు ఫోన్ చేసినా స్పందన లేదని బాధితులు పేర్కొన్నారు. స్థానికులు బాధితులను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. ఈ దాడి దృశ్యాలు సీసీ ఫుటేజీలో నమోదయ్యాయి. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి రాగా.. తమకు పోలీసులు న్యాయం చేయాలని బాధితులు వేడుకుంటున్నారు.

# అధికారులంతా వైకాపాకు కొమ్ముకాశారు

**మాజీమంత్రి ఆనం సంచలన వ్యాఖ్యలు**

**నెల్లూరు,మే17(పీపుల్స్ మోటివేషన్):**

తాజా ఎన్నికల్లో అధికారులెవరూ తమకు సహకరించలేదని నెల్లూరు జిల్లా ఆత్మకూరు తెదేపా అభ్యర్థి, మాజీ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. వారంతా వైకాపాకే కొమ్ముకాశారని ఆరోపించారు. పోలింగ్ కేంద్రాల వద్ద సరైన బందోబస్తు ఏర్పాట్లు చేయలేదని విమర్శించారు. శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యాత్మక మండలం మర్రిపాడులో ఒకటి నుంచి పది పోలింగ్ కేంద్రాల్లో నాటుబాంబుల సంస్కృతి ఉందని.. అలాంటి చోట్ల మహిళా కానిస్టేబుళ్లను నియమించారన్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే తప్ప భద్రత గురించి పట్టించుకునే నాథుడే లేదని దుయ్యబట్టారు. వివిధ పోలింగ్ కేంద్రాల్లో తెదేపా ఏజెంట్లను అప్రమత్తం చేసి.. 3 వేల ఓట్లు రిగ్గింగ్ కాకుండా అడ్డుకున్నామన్నారు. జూన్ 4న వెలువడే ఫలితాల్లో కూటమి ప్రభుత్వమే విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 'సీఎం జగన్‌కు ప్రజల సంక్షేమం పట్టదు.. మేకవన్నె పులిలా తిరిగారు. రాష్ట్రంలో మాఫియా రాజ్యం నడుస్తోందని ప్రత్యక్షంగా చెప్పాను. జగన్ రాష్టాన్ని దోపిడీ చేశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రాజ్యాంగ విరుద్ధమైనది. పాలనానుభవం కలిగిన చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారు'అని ఆనం అన్నారు.

# అబద్ధాల గురించి మీరే చెప్పాలే

**దళిత ముఖ్యమంత్రి మొదలు అబద్దాలన్నీ మీఖాతాలోనే**

**బిఆర్ఎస్ విమర్శలకు కాంగ్రెస్ ధీటుగా సమాధానం**

**హైదరాబాద్,మే17(పీపుల్స్ మోటివేషన్):**

'కాంగ్రెస్ పార్టీ బతుకే ఇంత.. రోజుకో మాట పూటకో అబద్ధం' అంటూ బీఆర్ఎస్ పార్టీ చేసిన ట్వీట్ కు కాంగ్రెస్ కౌంటర్ ఇచ్చింది. 'ఇగ అబద్దాల గురించి మీరే చెప్పాలే మాకు..!! దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానన్న దగ్గరి నుండి.. అదే దళితుడికి మూడెకరాల భూమి ఇస్తానన్న నిక్కమైన నిజాలే మాట్లాడే నీతిమంతులైతిరి!! సిగ్గుండాలే మాట్లాడనీకే.!!' అంటూ ఓటమితో మెదడు సన్నబారి.. సన్నవడ్ల మీద రాజకీయం మొదలెట్టిన సన్నాసి.. ఇంకెన్ని విషప్రచారాలు చేస్తావ్?మాటకు హద్దుండాలే.. గెలుపుపై ఆశలు సన్నగిల్లి.. సన్న వడ్లపై ఏంది మీ లొల్లి?! అని కేసీఆర్ ఫొటోను అటాచ్?చేస్తూ ట్విట్టర్ వేదికగా ప్రశ్నించింది.

# ఎన్నికల్లో మళ్లీ విజయం సాధించబోతున్నాం

**పాజిటివ్ ఓటు కారణంగానే పోలింగ్ శాతంలో పెరుగుదల**

**ఎన్నికల హింసకు కారణం ఇసి వైఫల్యమే**

**కుప్పంలోనూ గెలుపు వైసిపిదే అన్న సజ్జల**

**అమరావతి,మే17(పీపుల్స్ మోటివేషన్):**

ఎన్నికల్లో విజయంపై తాము పూర్తి విశ్వాసంతో ఉన్నామని.. గత ఎన్నికల్లో గెలిచిన సీట్ల కంటే ఈ సారి ఎక్కువే గెలుస్తామని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. అంతేకాదు కుప్పంలోనే వైకాపా విజయం సాధిస్తోందని అన్నారు. శుక్రవారం ఆయన తాడేపల్లిలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. ఓటింగ్ సరళిని చూసి ప్రభుత్వ వ్యతిరేక ఓటు అనుకోవద్దన్నారు. చంద్రబాబుకు ఆయన మీద ఆయనకే నమ్మకం లేదు. చంద్రబాబు పూర్తిగా నెగిటివ్ క్యాంపెన్ చేశారు. జగన్ ప్రచారం ప్రజల్లోకి బలంగా వెళ్లింది. కుప్పంలోనూ వైఎస్సార్‌సీపీ గెలవబోతోంది. కుట్రపూరితంగా కేంద్రం సహాయంతో కొందరు అధికారులను తప్పించారు. ల్యాండ్ టైట్లింగ్‌పై చంద్రబాబు అర్థంలేని ఆరోపణలు చేశారు. చంద్రబాబు హామీలపై ప్రజలకు నమ్మకం లేదని సజ్జల పేర్కొన్నారు. పోలీసులు పెద్దారెడ్డి ఇంట్లోని సీసీటీవీలు ధ్వంసం చేయడం అన్యాయం. పెద్దారెడ్డి ఇంట్లో పోలీసులు సీసీ కెమెరాలు ధ్వంసం చేయడమేంటి?. దాడిపై ఈసీకి ఫిర్యాదు చేస్తున్నాం అని సజ్జల చెప్పారు. కౌంటింగ్‌లో అక్రమాలు జరుగుతాయని అనుకోవడం లేదు.. కౌంటింగ్‌లో అక్రమాలు జరిగితే ఎదుర్కొంటాం. ఈసీ నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరుతున్నాం. ఇప్పటికేనీ ఈసీ తప్పు సరిదిద్దుకుంటే మంచిందని సజ్జల హితవు పలికారు. మళ్లీ అధికారంలోకి వస్తున్నాం. సాంప్రదాయ ఓటు బ్యాంక్ మావైపు ఉంది. మాకు కాన్ఫిడెన్స్ ఉంది, ఓవర్ కాన్ఫిడెన్స్ లేదు. ప్రజలు ఓటింగ్ లో పాల్గొన్న తీరు చూస్తుంటే మళ్ళీ విజయం సాధిస్తాం. పోలింగ్ పర్సంటేజ్ పెరిగితే మేము ఓడిపోతామన్న భ్రమలో టీడీపీ ఉంది. మాపై వ్యతిరేకత ఉన్న వర్గాలు ఎక్కడా లేవు. ప్రజలు నమ్మటం లేదని చంద్రబాబు సూపర్ సిక్స్ గురించి ప్రచారం చేసుకోలేదు. వివేకా హత్య, ల్యాండ్ టైట్లింగ్ గురించి తప్ప తాను చేసే మంచి గురించి ఎక్కడైనా చెప్పాడా. సీఎం జగన్ చేసిన అభివృద్ధి సంక్షేమం అభివృద్ధి చూసి ఓటు వేయాలని అడిగారు. నన్ను చూసి నేను చేసిన మంచి చూసే ఓటు వేయాలని జగన్ అడిగారు. టీడీపీ గెలవడానికి ఉన్న ఒక్క కారణమైనా చెప్పగలరా అంటూ సజ్జల ప్రశ్నించారు. చంద్రబాబు కూడా ఎన్నికల్లో విజయం సాధిస్తామని చెప్పలేక పోతున్నారు. టీడీపీ కూటమి వలనే పోలింగ్ లో హింస జరిగింది. వారు చెప్పిన అధికారులే హింసకు కారణమయ్యారు. ఇప్పుడు వాళ్లనే ఈసీ తొలగించి చర్యలు తీసుకుంది. ఇంకా తొలగించాల్సిన వాళ్ళు కొందరు ఉన్నారు. పోలింగ్‌కు ముందు అడ్డగోలుగా అధికారుల బదిలీ చేశారు. అల్లర్లు జరిగాయి అంటే ఈసీ విఫలం అయ్యినట్లే. వీటి వెనుక చంద్రబాబు పాత్ర ఉన్నట్లే. ఈ-ఆఫీసు అప్ గ్రేడ్ చేస్తుంటే గవర్నర్‌కు లేఖలు రాస్తున్నారు. రికార్డులు మాయం అవుతున్నాయని పిచ్చి పిచ్చి లేఖలు రాస్తున్నారని సజ్జల ధ్వజమెత్తారు. తాడిపత్రిలో పెద్దారెడ్డి ఇంట్లో పోలీసులే సీసీ కెమెరాలు ధ్వంసం చేశారు. ల్యాండ్ టైట్లింగ్ గురించి ఎన్నికల తరువాత టీడీపీ ఎందుకు మాట్లాడటం మానేసింది?. ల్యాండ్ టైటలింగ్ అమలు చేయాలని నీతి అయోగ్ చెప్పింది. కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగాలంటే పోలీసు అబ్జర్వర్ దీపక్ మిశ్రాను తొలగించాలి. టీడీపీ కొంతమంది పోలీసులను తమ ఏజెంట్లుగా మార్చుకుంది. ప్రశాంతంగా కౌంటింగ్ జరగాలని కోరుకుంటున్నాం. ఎన్నికల కమిషన్ బాధ్యతాయుతంగా ఉంటే ఇంత విధ్వంసం అల్లర్లు జరిగేవి కావు. ఒక వర్గానికి కొమ్ము కాస్తున్న వారిని పక్కన పెట్టాలని ఎన్నికల కమిషన్‌ను కోరుతున్నాం. కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు అన్ని ప్రాంతాల్లోనూ గెలుస్తాం. జగన్ పాలనలో లబ్ది పొందని వర్గాలు, న్యాయం జరగని కుటుంబం అంటూ ఏమీ లేవు. అందరికీ మేలు చేసినందునే భారీ సీట్లతో గెలవబోతున్నాం అని సజ్జల ధీమా వ్యక్తం చేశారు. కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు వైసీపీనే గెలుస్తుందని ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. తమ పార్టీ గెలుపుపై తమకు పూర్తి నమ్మకం ఉందని పేర్కొన్నారు. తమ గెలుపుపై కాన్ఫిడెన్స్ ఉంది కానీ.. ఓవర్ కాన్ఫిడెన్స్ లేదని స్పష్టం చేశారు. పోలింగ్ శాతం పెరిగితే గెలుస్తామన్న భ్రమలో టీడీపీ ఉందని విమర్శించారు. చంద్రబాబు అప్పుడే అధికారంలోకి వచ్చినట్లు భావిస్తున్నారని తెలిపారు.

తెలుగు దినపత్రిక

పీపుల్స్ మోటివేషన్

People's Motivation

శనివారం । మే । 18 । 2024



# విజయవాడ హైవేపై తరచూ రోడ్డు ప్రమాదాలు

**17 బ్లాక్ స్పాట్స్ గర్తించిన అధికారులు**

**ప్రమాదాల నివారణపై మంత్రి కోమటిరెడ్డి సమీక్ష**

**హైదరాబాద్,మే17(పీపుల్స్ మోటివేషన్):**

హైదరాబాద్ – విజయవాడ హైవేపై నిత్యం వేల సంఖ్యలో వాహనాలు వెళుతుంటాయి. ఆ స్థాయిలోనే ప్రమాదాలూ జరుగుతుండటం అధికారులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. హైదరాబాద్ – విజయవాడ హైవేపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్న 17 బ్లాక్ స్పాట్స్‌ని అధికారులు గుర్తించారు. ఈ ప్రాంతాల్లో ప్రమాదాలను తగ్గించే అంశంపై డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఈఎన్సీ గణపతి రెడ్డి, జాతీయ రహదారుల శాఖ అధికారులు పాల్గొన్నారు. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే ఎన్ హెచ్ 65పై 17 ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించారు. ప్రాంతాల్లో అత్యధిక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్టు జాతీయ రహదారుల శాఖ గుర్తించింది. సైన్ బోర్డ్స్ ఏర్పాటు చేయడం, కొన్నిచోట్ల ఆరు లేన్లుగా రోడ్డు నిర్మాణం చేయడం, జంక్షన్ డెవలప్ మెంట్స్, ÷ఎజఖ (వెహికిల్ అండర్ పాస్)ల నిర్మాణం, రెండు వైపుల సర్వీస్ రోడ్ల నిర్మాణం వంటి చర్యలతో బ్లాక్ స్పాట్స్ ప్రాంతాల్లో ప్రమాదాలను నివారించాలని ప్రభుత్వం భావిస్తోంది. మంత్రితో సమావేశం అనంతరం ప్రమాదాల నివారణకు చేపట్టబోతున్న పనుల్లో స్పష్టత రానుంది. ఈ రహదారిపై ఎక్కువ డ్యామేజ్ లు అయినట్లు అధికారులు మంత్రికి తెలిపారు. మొత్తం 17 బ్లాక్ స్పాట్స్ ఉన్నాయని, వాటిని సంస్కరించేందుకు చర్యలు తీసుకునే అంశంపై ప్రధానంగా చర్చించినట్టు తెలుస్తోంది. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. అండర్ పాస్ లు ఉన్న ప్రదేశాల్లో ఎలాంటి చర్యలు తీసుకోవాలనే విషయమై అధికారులతో మంత్రి చర్చించారు. చిన్నపాటి వర్షానికే నగర రోడ్లు నదులను మరిపిస్తున్నాయి. దీని ప్రభావంతో కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ జామ్ అవుతోంది. కాలనీలు జలమయం అవుతున్నాయి. ఈ సమస్యల పరిష్కారానికి తీసుకోవాలల్సిన చర్యలపై అటు జీహెచ్ఎంసీ అధికారులతోనూ మంత్రి చర్చించారు. కొత్త రోడ్లు వేసే చోట్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడుతూ ఉంది. దీనికి తోడు తాత్కాలికంగా వేసిన రోడ్లు డ్యామేజీ అవుతున్నాయి. వాటి మరమ్మతులకు తీసుకోవాల్సిన చర్యలపైనా మంత్రి రివ్యూ చేస్తున్నారు. ఈ సమావేశంలో ఈఎన్సీ గణపతిరెడ్డి, నాయ్ ఆర్వో రజక్, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# అమేథీ నుంచే రాజకీయ ఓనమాలు

**తనకు ఈ ప్రాంతంతో విడదీయరాని అనుబంధం**

**అమేథీతోనే ఉన్నాను..ఉంటాను కూడా**

**ఎన్నికల ప్రచారంలో రాహుల్ ఉద్వేగం**





**అమేథీ,మే17(పీపుల్స్ మోటివేషన్):**

కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ అమేథీపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. అమేథీ నుంచే తాను రాజకీయాలు నేర్చుకున్నానని, తాను వారితోనే ఉన్నానని, ఉంటానని చెప్పారు. ఉత్తరప్రదేశ్‌లోని అమేథీలో కాంగ్రెస్, ఇండియా కూటమి అభ్యర్థి కేఎల్ శర్మ తరఫున శుక్రవారంనాడు ఎన్నికల ప్రచార సభలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. రాహుల్‌తో పాటు అఖిలేష్ కూడా ప్రచారానికి హాజరయ్యారు. ఐదో విడత పోలింగ్‌లో భాగంగా మే 20న అమేథీలో పోలింగ్ జరుగనుంది. రాహుల్ తన ప్రసంగంలో 42 ఏళ్ల క్రితం తన తండ్రి రాజీవ్ గాంధీతో కలిసి అమేథీకి వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. రాజకీయాల గురించి తాను ఏది నేర్చుకున్నా అది ఇక్కడి (అమేథీ) నుంచే నేర్చుకున్నానని, ప్రజలే తనకు నేర్పారని చెప్పారు. తాను తొలిసారి అమేథికి వచ్చిన సమయంలో అప్పుడు రోడ్లు కానీ, అభివృద్ధి కానీ లేదన్నారు. తన తండ్రికి, అమేథీ ప్రజలకు మధ్య ఉన్న ప్రేమానుబంధానికి తానే సాక్షినని చెప్పారు. తాను కూడా ఇదే తరహా రాజకీయాలను పాటిస్తున్నానని తెలిపారు. తాను రాయబరేలి నుంచి పోటీ చేస్తున్నప్పటికీ అమేథీతో మొదట్నించీ తనకున్న అనుబంధం చెక్కుచెదరదని, ఎప్పటికీ అమేథీ ప్రజల వెన్నంటి ఉంటానని చెప్పారు. 2024 లోక్‌సభ ఎన్నికలు చాలా కీలకమని రాహుల్ తెలిపారు. ఒక రాజకీయ పార్టీ, ఆ పార్టీ నేతలు రాజ్యాంగాన్ని తిరగరాస్తామని, రాజ్యాంగాన్ని బుట్టదాఖలా చేస్తామని తొలిసారి చాలా స్పష్టంగా చెబుతున్నారని పరోక్షంగా బీజేపీని ఉద్దేశించి విమర్శించారు. రాజ్యాంగాన్ని చెరిపేద్దామా? రాజ్యాంగాన్ని తుడిచిపెట్టే శక్తి ఈ ప్రపంచంలో ఎవరికైనా ఉందా? అని ప్రజలను ఉద్దేశించి రాహుల్ ప్రశ్నించారు. రాజ్యాంగాన్ని ప్రజలే పరిరక్షించుకోవాలని, రాజ్యాంగమే ప్రజా వాణి, ప్రజా భవిష్యత్తు అని స్పష్టం చేశారు. ఈ దేశంలో పేద ప్రజలకు ఏది చేసినా, రైతులకు సహాయపడినా, హరిత విప్లవం తెచ్చినా రాజ్యాంగంతోనే సాధించామని చెప్పారు. రాజ్యాంగానికి చరమగీతం పాడాలని నరేంద్ర మోదీ కోరుకుంటున్నారని, రాజ్యాంగం కనుమరుగైతే ఇక ప్రభుత్వ రంగమనేదే ఉండదని, ఉద్యోగాలు ఉండవని, ద్రవ్యోల్బణం తారాస్థాయికి చేరుకుందని, రిజర్వేషన్లకు స్వస్తి పలుకుతారని, ప్రజల హక్కులు ఒక్కొక్కటి ఊడలాక్కుంటారని రాహుల్ హెచ్చరించారు. కేవలం ఎంపిక చేసిన 22–25 మంది కుబేరుల కోసం రైతులు, కార్మికులు, యువత, తల్లులు, సోదరీమణుల హక్కులను హరిస్తారని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 140 సీట్లు సాధించడం కూడా కష్టమేనని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ అన్నారు. నాలుగు విడతల ఎన్నికలు పూర్తయ్యే సరికే బీజేపీ ఓటమిదశకు చేరుకుందన్నారు. వారి రథం మునకలేస్తోందని, 400 సీట్లు తమ లక్ష్యమని నినాదాలిచ్చినా ప్రజలు 140 సీట్లకే పరిమితం చేయనున్నారని చెప్పారు. రాజ్యాంగాన్ని, ప్రజల హక్కులను మార్చాలనుకుంటున్న వారిని ప్రజలే మార్చాలనుకుంటున్నారని అన్నారు. అమేథీలో కాంగ్రెస్ అభ్యర్థిగా గాంధీ కుటుంబం విధేయుడుగా పేరున్న కిషోరి లాల్ శర్మ పోటీ చేస్తుండగా, బీజేపీ అభ్యర్థిగా కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ, బీఎస్పీ అభ్యర్థిగా నాన్హె సింగ్ చౌహాన్ పోటీ పడుతున్నారు.

# ప్రతిపక్ష నేతల ప్రసంగాల్లో అభ్యంతరకర పదాలు

- **ఎన్నికల ప్రసంగం నుంచి తొలగించిన ప్రసారభారతి**

**న్యూఢిల్లీ,మే17(పీపుల్స్ మోటివేషన్):**

ప్రతిపక్ష నేతల ప్రసంగాల్లోని పదాలను దూరదర్శన్, ఆకాశవాణిలు తొలగించాయి. సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నాయకుడు జి.దేవరాజన్ ప్రసంగాల్లోని కొన్ని పదాలను ఇవి తొలగించాయి. 'మత నియంతృత్వం, క్రూరమైన చట్టాలు, ముస్లింలు' వంటి పదాలను వారి ప్రసంగాల నుండి తీసివేశారు. ఢిల్లీలోని దూరదర్శన్ స్టూడియోలో సీతారాం ఏచూరి ఇచ్చిన టెలివిజన్ ప్రసంగం నుండి రెండు పదాలను తొలగించగా, 'దివాలా' ప్రభుత్వం పదాన్ని 'వైఫల్య' ప్రభుత్వంగా మార్చారు. కాగా, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నాయకుడు జి.దేవరాజన్ ప్రసంగంలో నుండి 'ముస్లింలు' అనే పదాన్ని తొలగించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా, ఆకాశవాణి, దూరదర్శన్‌లలో కేటాయించిన ప్రసార సమయంలో చేసిన ప్రసంగాలలో ఈ చర్య తీసుకోబడింది. అదే సమయంలో ఎన్నికల సంఘం ప్రవర్తనా నియమావళి ప్రకారం చర్యలు తీసుకున్నామని, ఇంతకుముందు కూడా ఇలాంటి చర్యలు చేపట్టామని ప్రసార భారతి అధికారులు వివరించారు. ఈ చర్యపై వివిధ వర్గాల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# అకాల వర్షంతో అన్నదాతల కుదేలు

- **ఉమ్మడి జిల్లాలో భారీగా పంటనష్టం**
- **తడిసి ముద్దయిన కల్లాల్లో ఆరబోసిన ధాన్యం**

**వరంగల్,మే17(పీపుల్స్ మోటివేషన్):**

తెలంగాణ వ్యాప్తంగా అకాల వర్షాలకు రైతులు లబోదిబో మంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ధాన్యం తడిసిపోవడంతో కొనేవారు రాక ఆందోళన చెందుతున్నారు. పంట వేసిన దగ్గర నుంచి పంట చేతికి వచ్చేవరకు, కంటిమీద కునుకు లేకుండా కష్టపడుతున్న రైతన్న.. తీరా పంట చేతికి వచ్చాక దళారుల దగ్గర పోరాడలేక ఓడిపోతున్నాడు. తాజాగా అకాల వర్షాలు రైతన్నను నిండా ముంచేస్తున్నాయి. చేతికందొచ్చిన పంట క్లళెదుటే మట్టిపాలు కావడంతో గుండెలు బాదుకుంటున్నారు. కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దవడంతో భోరుమంటున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పెద్దఎత్తున ధాన్యం వర్షార్పణమైంది. వానల నుంచి పంటను కాపాడుకోవడం కోసం పడరాని పాట్లు పడుతున్నారు రైతులు. దంచికొడుతున్న వానలు అన్నదాతలను నట్టేట ముంచాయి..నోటి కాడి బుక్క నీటిపాలడంతో రైతన్నలు దిగులుతో తలలు పట్టుకుంటున్నారు. కళ్ళాల్లో ఆరబోసిన ధాన్యం వరదల్లో కొట్టుకుపోతుంటే, రైతన్న గుండె చెరువు అవుతుంది. వరంగల్ ఉమ్మడి జిల్లాలో గతవారం రోజుల నుండి కురుస్తున్న వడగండ్ల వానల ప్రభావంతో వివిధ పంటలకు ఊహించిన విధంగా నష్టం వాటిల్లింది. వేసవిలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం అన్నదాత గుండె చేరువయ్యేలా చేసింది. పగబట్టిన ప్రకృతి రైతులు కుమిలి పోయేలా చేస్తోంది. చేతికి వచ్చిన పంట అమ్ముకునే సమయంలో దరిద్రపుగొట్టు వర్షాలు అన్నదాతలను నట్టేట ముంచాయి. వడగండ్ల వానలు రైతులకు ఊహించని విధంగా నష్టాన్ని కలిగిస్తున్నాయి. వడగండ్ల వానల ప్రభావంతో వరి పంటకు ఊహించని విధంగా నష్టం వాటిల్లింది..వరంగల్, ములుగు, మహబూబాబాద్, భూపాలపల్లి, జనగామ జిల్లాల్లో వరి పంట మొత్తం వర్షార్పణమైంది..

ఇప్పటికే కోతలు పూర్తయి అమ్మకం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.. చాలా ప్రాంతాల్లో కల్లాల్లో దాన్యం ఆరబోసుకొని అమ్ముకోవడానికి ఎదురుచూస్తున్నారు. మరి కొంతమంది రైతులు రోడ్లపై దాన్యం

ఆరబోసుకుని అమ్ముకోవడానికి కళ్ళలో వత్తులు వేసుకుని ఎదురు చూస్తున్నారు. వడగండ్ల వానల నుండి పంటను కాపాడుకోవడం కోసం పడరాని పాట్లు పడుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల కారణంగా ధాన్యం కొనుగోలులో కొంత అంతరాయం ఏర్పడింది. ఆ జాప్యం ఇప్పుడు రైతుల గుండె చేరువయ్యాలా చేస్తోంది. చేతికొచ్చిన పంట వర్షార్పరం అయిపోతుండడంతో రైతులు తల్లడిల్లిపోతున్నారు. అక్కడా.. ఇక్కడన్న తేడా లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి. ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దడంతో రైతులు తల్లడిపోతున్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని అన్నదాతలు వేడుకుంటున్నారు. మరోవైపు మామిడి పంటకు కూడా ఇదే రకమైన పరిస్థితి నెలకొంది ఈదురుగాలుల ప్రభావంతో మామిడిపాటంతా నేలరాలిపోయి రైతులు ఆందోళన చెందుతున్నారు.. మిర్చి పంట కూడా దాదాపుగా తుడిచి పెట్టుకుపోతుంది. కళ్ళాల్లో ఆరబోసిన మిర్చి పంటనీతా తడిసి ముద్దమవడంతో రైతులు దిగులుతో తలలు పట్టుకున్నారు. వడగండ్ల వాన ప్రభావంతో తీవ్ర నష్టాన్ని చూసిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు. మరోవైపు వర్షాల ప్రభావంతో ఏర్పడే ఇబ్బందుల నుండి ప్రజలను రక్షించడం కోసం వరంగల్ నగరంతో పాటు జిల్లా కేంద్రాలలో అధికారులు టోల్ ఫ్రీ నెంబర్లను ప్రకటించారు అధికారులు.

# నేడు తెలంగాణ కేబినేట్ భేటీ

**సచివాలయంలో సిఎం రేవంత్ అధ్యక్షతన సమావేశం**

**రుణమాఫీ, విభజన అంశాలతో పాటు పలు సమస్యలపై చర్చ**





**హైదరాబాద్,మే17(పీపుల్స్ మోటివేషన్):**

కొద్ది రోజుల విరామం తరవాత తెలంగాణ మంత్రి వర్గం శనివారం సమావేశం అవుతోంది. పార్లమెంట్ ఎన్నిక లనేపథ్యంలో ప్రభుత్వ కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. కోడ్ కారణంగా ఏ పనీ చేయలేక పోయారు. ఎన్నికలు ముగియడంతో ఇప్పుడు సిఎం రేవంత్, మంత్రులు సచివాలయం నుంచి తమ విధులను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో శనివారం రాష్ట్ర కేబినేట్ సమావేశం జరుగనుంది. ఇందులో ప్రధానంగా రైతుల రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం తదితర అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. రాష్ట్ర పునర్విభజన జరిగి పదేండ్లు పూర్తి కానుండటంతో పునర్విభజన చట్టానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్నవి, తెలంగాణ, ఏపీ మధ్య అపరిష్కృతంగా ఉన్న అంశాలపై కేబినేట్‌లో చర్చించనున్నారు. . ఉద్యోగులు, ఆస్తులు, అప్పుల విభజనపై నివేదిక ఇవ్వాలని సీఎం రేవంత్.. ఇప్పటికే అధికారులను ఆదేశించారు. రెండు రాష్ట్రాల సయోధ్యతో ఉద్యోగుల బదిలీ సమస్యను పరిష్కరించాలన్నారు సీఎం రేవంత్. క్లిష్టమైన అంశాలపై రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేలా కార్యాచరణ ఉండాలని అనుకుంటున్నారు. దీనికి సంబంధించి కేబినెట్ లో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. అలాగే ఆగస్ట్ 15లోపు రైతుల రుణమాఫీ చేసి తీరాలని ముఖ్యమంత్రి ఇప్పటికే అధికారులను ఆదేశించారు. అందుకు సంబంధించిన నిధుల సమీకరణపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. తెలంగాణలో దాదాపు 40 లక్షల మంది రైతులు రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నారు. రూ. 2 లక్షల వరకు రుణాలు మాఫీ చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీని కోసం రూ. 34 వేల కోట్ల వరకు నిధులు అవసరం అవుతాయని అంచనా. రైతు సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రుణమాఫీ చేస్తామని రేవంత్ రెడ్డి చెబుతున్నారు. ఇంత పెద్ద మొత్తంలో నిధులు ఎక్కడి నుంచి వస్తాయన్న దానిపై రేవంత్‌కు క్లారిటీ ఉందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని అనుకుంటున్నారు. ఆ దిశగా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ధాన్యం కొనుగోళ్ల పురోగతిని సమీక్షించి, వచ్చే ఖరీఫ్ పంటల ప్రణాళికపై చర్చ జరుగనుంది. రాష్ట్ర ఆదాయం పెంచుకునే దిశగా వనరుల సమీకరణ, ఆదాయ పెంపు ప్రత్యామ్నాయాలపై కేబినేట్ లో చర్చిస్తారు. కుంగిపోయిన మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల రిపేర్లకు సంబంధించి నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇటీవలే మధ్యంతర నివేదికను సమర్పించింది. నివేదికలోని సిఫారసులు, తదుపరి చేపట్టాల్సిన కార్యాచరణపై ఈ సమావేశంలో చర్చించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. జూన్ నుంచి కొత్త విద్యాసంవత్సరం ఆరంభమవుతుంది. స్కూల్, కాలేజీల ప్రారంభానికి ముందే అవసరమైన సన్నాహక చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. విద్యార్థుల నమోదు, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ల పంపిణీ తదితర అంశాలను చర్చించనున్నారు. అలాగే కార్పోరేట్ స్కూళ్ల ఫీజుల నియంత్రణపైనా చర్చించే అవకాశం ఉంది. గత ప్రభుత్వం హయాంలో ఈ విషయంలో అస్సలు పట్టించుకోలేదు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వంద రోజుల పాలన అనంతరం ఎన్నికల కోడ్ వచ్చింది. ఈ వంద రోజుల్లోనే ఐదు గ్యారంటీలను హడావుడిగా అమలు చేశారు. ఆ పథకాల అమలు తీరుపైనా కేబినెట్ లో చర్చించే అవకాశాలు ఉన్నాయి. లోటు పాట్లు ఉంటే సరిదిద్దుకునేందుకు చర్చించనున్నారు. అలాగే నెరవేర్చాల్సిన హామీలు.. స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు.. లోక్ సభ ఎన్నికల పోలింగ్ సరళిపైనా మంత్రులతో .. కేబినెట్ భేటీ అనంతరం రేవంత్ చర్చించే అవకాశం ఉంది.

# అమేథీ, రాయబరేలీల్లో గెలుస్తున్నాం

**కాంగ్రెస్ నేత కెసి వేణుగోపాల్ ధీమా**

**అమేథీ,మే17(పీపుల్స్ మోటివేషన్):**

ఈ లోక్‌సభ ఎన్నికల్లో 'ఇండియా' బ్లాక్ అత్యధిక స్థానాలను సొంతం చేసుకుంటుందని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కె.సి వేణుగోపాల్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. 'మేము రాయబరేలి, అమేథీ రెండు స్థానాల్లో గెలుస్తాము. మీరు ఎక్కడికెళ్లినా ప్రజల మూడ్‌ని గమనిస్తే.. 'ఇండియా' బ్లాక్‌కి అనుకూలంగా ఉంది.' అని ఆయన అన్నారు. బిజెపి 150 సీట్లకు మించి గెలవదని రాహుల్ అనడాన్ని మీడియా ప్రతినిధులు వేణుగోపాల్‌ని ప్రశ్నించగా.. 'రాహుల్ దేశవ్యాప్తంగా పర్యటించారు. ఆయనకు ప్రజల పల్స్ తెలుసు. అందుకే బిజెపికి అంతకన్నా ఎక్కువ సీట్లు రావు అని రాహుల్ అంచనా.' అని ఆయన అన్నారు. ÷ూగా, అమేథీ నుంచి ఇండియా బ్లాక్ అభ్యర్థి కె.ఎల్ శర్మ పోటీ చేస్తున్నారు. ఆయన విజయాన్ని కాంక్షిస్తూ.. సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్, కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ప్రచార ర్యాలీ నిర్వహించారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

# తొందరపాటు నియామకాల వల్లే ఘటనలు

- అధికారులను మార్చిన చోటే అల్లరు
- పక్కాగా వైకాపా గెలుస్తోంది
- 9న విశాఖలో జగన్ ప్రమాణం ఖాయం
- ఓటమి భయంతోనే టిడిపి మహానాడు రద్దు
- మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడి

**విశాఖపట్నం,మే17(పీపుల్స్ మోటివేషన్):**

ఎన్నికల కమిషన్ నియమించిన రిటైర్డ్ పోలీసు అధికారి ఏక పక్ష నిర్ణయంపై గవర్నర్‌ను కలిసినట్లు మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. అధికారి మార్పులో జాగ్రత్తలు పాటించక పోవడం వల్ల కొన్ని ఘటనలు జరిగాయని, అందుకే కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశామని చెప్పారు. ఏ ప్రాంతంలో అధికారుల మార్పిడి జరిగిందో అక్కడే అల్లర్లు జరిగాయని అన్నారు. తొందరపాటు నియమకాల వల్ల హింసాత్మక ఘటనలు జరిగాయని మంత్రి బొత్స పేర్కొన్నారు అధికారులను నియమించేటప్పుడు వాళ్ల పూర్వపరాలు తెలుసుకోవాలని తెలిపారు. రాజకీయ కక్షతో హింసను ప్రేరేపిస్తున్నారని మండిపడ్డారు. హింసా ఘటనలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించమని స్పష్టం చేశారు. ప్రతిపక్ష పార్టీలు కక్షపూరిత చర్యలు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనవసరంగా తమపై నిందలు వేయడం సరికాదని అన్నారు. హింసాకాండకు వైఎస్సార్‌సీపీ పూర్తి వ్యతిరేకమని తెలిపారు. రాజకీయ లబ్ది కోసం హింసను ప్రేరేపించవద్దని అన్ని పార్టీలను కోరుతున్నట్లు చెప్పారు. పోలీసులు ఏ రాజకీయ పార్టీల ప్రలోభాలకు లోను కాకుండా నిస్పక్షపాతంగా పనిచెయ్యాలి మళ్లీ అధికారంలో వచ్చేది తామనేనని బొత్స సత్యనారాయణ అన్నారు. 175 సీట్లకు దగ్గరగా గెలవబోతున్నామని చెప్పారు. జూన్ 9న విశాఖలోనే సీఎంగా వైఎస్ జగన్‌మోమన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం జరుగుతుందని తెలిపారు. 'టీడీపీ ఫలితాల పై ఢీలా పడింది.. అందుకే మహానాడు వాయిదా వేసుకున్నారు. ఉత్తరాంధ్రలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. చిన్న చిన్న సంఘటనలను ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం వాడే ప్రయత్నం చేయొద్దు. పోలీసులు కూడా న్యాయ బద్ధంగా వ్యవహరించండి. రాజకీయ పార్టీలు హింసను ప్రోత్సహించవద్దు. వైయస్సార్ సీపీ అలాంటి హింసలు ప్రోత్సహించదు. నిన్న విశాఖ పార్లమెంట్ పరిధిలో జరిగిన ఓ ఘటనను రాజకీయం చేస్తున్నారు త్వరలో విశాఖ కేంద్రంగా సీఎం జగన్ మోహన్ రెడ్డి పాలన ప్రారంభిస్తున్న దశలో విశాఖ ప్రశాంతతను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉంది. విశాఖ ప్రశాంతతను కాపాడాలని కోరుకుంటున్నా. .రాజకీయ నాయకునిగా కేంద్రంలో సుస్థిర ప్రభుత్వం రావాలని కోరుకోవాలి. కానీ రాష్ట్ర ప్రయోజనాల రీత్యా మా పార్టీ సీట్లు అవసరం వుండేలా కేంద్రంలో అధికారం రావాలని కోరుకుంటున్నా. ఉత్తరాంధ్ర లో 34 సీట్లు వస్తాయి. ప్రజా తీర్పు ఆధారంగా విశాఖ పరిపాలన రాజధాని చేయాలని కోర్టును కూడా కోరుతానీ' అని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో వైసీపీ తప్పకుండా అధికారంలోకి వస్తుందని మంత్రి బొత్స సత్యనారాయణ ధీమా వ్యక్తం చేశారు. వచ్చే నెల 9న జగన్ సీఎంగా విశాఖపట్నంలో ప్రమాణ స్వీకారం చేస్తారని తెలిపారు. వేదిక ఎక్కడో రెండు రోజుల్లో చెబుతానని అన్నారు. కేంద్రంలో తమ మీద ఆధారపడే ప్రభుత్వం రావాలని కోరుకుంటానని... ఇది తన స్వార్థమని తెలిపారు. పోలింగ్ సరళి చూస్తే వైసీపీకి 175 స్థానాలు పక్కా.. ఉత్తరాంధ్రలో 34 కి 34 స్థానాలు తమవేనని చెప్పారు. రుషి కొండలో నిర్మించిన భవనాలు ఎలా ఉపయోగించుకోవాలో త్వరలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.విశాఖలో జరిగిన ఘటన దురదృష్టమని అన్నారు. ఈ ఘటన లో రాజకీయ కోణం ఉంటే ముమ్మాటికీ తప్పేనని చెప్పారు. ఘటనపై పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ చేయాలి..దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. రాష్ట్ర ఎన్నికల పోలీస్ పరిశీలకుడి నియామకంపై అనుమానం ఉందన్నారు. ఎంతో మంది అధికారులు ఉంటే రిటైర్డ్ అయిన అధికారిని పరిశీలకుడుగా నియమించడం అనుమానంగా ఉందని మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు.

## ఫీజులో డిస్కౌంట్ పేరుతో మోసం

**యువకుడిని అరెస్ట్ చేసిన పోలీసులు**

**హైదరాబాద్,మే17(పీపుల్స్ మోటివేషన్) :**

యూఎస్ యూనివర్సిటీల్లో చదువుతున్న స్టూడెంట్స్ సెమిస్టర్ ఫీజు తమ ద్వారా చెల్లిస్తే 10శాతం డిస్కౌంట్ ఇస్తామంటూ మోసం చేసిన కనోళ్ళ అశోక్ అనే యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఏపీకి చెందిన అశోక్ కుమార్ ని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సుధాకర్ అనే యువకుడికి 10 శాతం డిస్కౌంట్ ఇప్పిస్తానని రూ.4 లక్షల 38 వేల 599 రూపాయలు వసూలు చేసి మోసం చేశాడు అశోక్. దీంతో బాధితుడు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. విచారణ చేపట్టిన పోలీసులు అశోక్ కుమార్ పై ఐపీసీ సెక్షన్ 419, 420 కింద కేసు నమోదు చేశారు. నిందితుడు అశోక్ మొబైల్ ని పోలీసులు సీజ్ చేశారు. గతంలో అశోక్ జాం కన్‌స్టలెంట్ ఏజెన్సీలో పనిచేశాడు.

## ఎస్‌వోటి పోలీసుల దాడిలో మాదకద్రవ్యాలు స్వాధీనం

**హైదరాబాద్,మే17(పీపుల్స్ మోటివేషన్) :**

కూకట్‌పల్లి ఠాణా పరిధిలోని శేషాద్రినగర్‌లో స్థానిక పోలీసులతో కలిసి ఎస్‌వోటీ పోలీసులు దాడులు నిర్వహించారు. శైలేష్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి అనే ఇద్దరు నిందితుల నుంచి 3 గ్రాముల ఎంఎండీఏ మాదకద్రవ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు తులసీనగర్‌లో జగద్గిరిగుట్ట పోలీసులతో కలిసి సోదాలు నిర్వహించిన ఎస్‌వోటీ బృందం రోహిత్, తిలక్ సింగ్ అనే ఇద్దరు నిందితుల నుంచి 45 గ్రాముల గంజాయితోపాటు 3 గ్రాముల ఎంఎండీఏను స్వాధీనం చేసుకున్నారు. ఈ రెండు కేసుల్లోనూ నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారిస్తున్నారు.

# ప్రజలు లబ్ధిపొందేలా రియల్ ప్రోత్సాహకాలు

**హరిత భవనాల నిర్మాణాలకు మరింత ఆదరణ**

**గ్రీన్ బిల్డింగ్ ప్రాపర్టీ షో ప్రారంభంలో మంత్రి శ్రీధర్ బాబు**

**హైదరాబాద్,మే17(పీపుల్స్ మోటివేషన్):**

ప్రతి పౌరుడు లబ్ధి పొందేలా తమ ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలు ఉంటాయని తెలంగాణ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. దీర్ఘకాలిక వ్యూహాలతో ముందుకెళ్తున్నామని చెప్పారు. నిర్మాణ రంగంలో హరిత భవనాలు పర్యావరణ పరిరక్షణకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. నగరంలోని హైటెక్స్‌లో గ్రీన్ బిల్డింగ్ ప్రాపర్టీ షోను మరో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. 40 శాతం విద్యుత్‌ను నిర్మాణరంగం వినియోగిస్తోంది. కర్బన ఉద్గారాలు సైతం వెలువడుతున్నాయి. హరిత భవనాల గురించి కొనుగోలు దారులకు నిర్మాణ సంస్థలు అవగాహన కల్పించాలి. 2003లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వీటి నిర్మాణం ప్రారంభమైంది. ప్లాస్టిక్ వినియోగంపై కేంద్రంలోని అప్పటి మన్మోహన్‌సింగ్ సర్కారు కఠిన చట్టాలను తీసుకొచ్చింది. గతంలో పౌర సరఫరాల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు ఆకస్మిక తనిఖీలు చేశాను. కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. మా ప్రభుత్వం ఏర్పడిన ఐదు నెలల్లోనే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం. ఐటీ రంగంలో రూ.వేలకోట్ల పెట్టుబడులు వస్తున్నాయి. దీనివల్ల ఉద్యోగాలతో పాటు పరోక్షంగా ఎన్నో అవకాశాలు లభిస్తాయి. సులభతర వాణిజ్య విధానానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. పెట్టుబడిదారులు, నిర్మాణ సంస్థలు, స్థిరాస్తి రంగానికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని శ్రీధర్‌బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ వైస్ ప్రెసిడెంట్ శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# తిరుమలలో భక్తుల రద్దీ

**జోరువానలోనూ క్యూలో ఎదురుచూపు**

**తిరుమల,మే17(పీపుల్స్ మోటివేషన్):**



తిరుమలకు భక్తులు పోటెత్తారు. వేసవి సెలవుల దృష్ట్యా ఏడుకొండలపై ఎటు చూసినా భక్తజన సందోహం కనిపిస్తోంది. అనూహ్యంగా పెరిగిన రద్దీతో సామాన్య భక్తులు శ్రీవారిని దర్శించుకునేందుకు 24 గంటల సమయం పడుతోంది. మరోవైపు జోరువాన కూడా భక్తులను అడ్డుకుంటోంది. అయినా స్వామి దర్శనం కోసం క్యూలో పాట్లు పడుతున్నారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో అన్ని కంపార్ట్‌మెంట్లు, నారాయణగిరి ఉద్యానవనంలోని షెడ్లు భక్తులతో నిండిపోయి.. ఔటర్ రింగురోడ్డులో 3 కిలోమీటర్ల మేర భక్తులు వేచి ఉన్నారు. టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులకు 24 గంటల సమయం పడుతోంది. క్యూలైన్‌లలో వేచి ఉన్న భక్తులకు తితిదే సిబ్బంది తాగునీరు, అల్పాహారం అందిస్తున్నారు. తిరుమలలో శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దీంతో శ్రీవారి ఆలయ ప్రాంగణం తడిసిముద్దయింది. స్వామివారి దర్శనం అనంతరం లడ్డూ విక్రయ కేంద్రాలు, గదులకు వెళ్లేందుకు భక్తులు ఇబ్బంది పడ్డారు. తితిదే ఏర్పాటు చేసిన షెడ్ల వద్ద భక్తులు తలదాచుకున్నారు. దాదాపు రెండు గంటల పాటు వర్షం కురవడంతో తిరుమల కొండల్లో చల్లని వాతావరణం ఏర్పడింది.

# రాయబరేలితో అనుబంధం విడదీయలేనిది

**ఇందిర నుంచి మమ్మలను ఆదరించారు**

**నాలాగే ఇప్పుడు రాహుల్‌ను కూడా ఆదరించండి**

**మీ ప్రేమకు సదా రుణపడి ఉంటాం**

**బరేలి ప్రచారంలో సోనియా పిలుపు**

**రాయబరేలి,మే17(పీపుల్స్ మోటివేషన్):**

తనను గతంలో ఆదరించినట్లుగానే తన తనయుడు రాహుల్‌ను కూడా రాయబరేలి ప్రజలు ఆదరించాలని, అతను మీ వెన్నంటి ఉంటాడని రాయబరేలి ప్రజలకు ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియాగాంధీకీలక అభ్యర్థన చేశారు. నియోజకవర్గం ప్రజలు తనను ఆదరించినట్టే తన కుమారుడు రాహుల్ గాంధీని కూడా అక్కున చేర్చుకోవాలని కోరారు. ప్రజల ఆశలను రాహుల్ ఏమాత్రం వమ్ము చేయరని అన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా తొలిసారి సోనియాగాంధీ రాయబరేలిలో శుక్రవారంనాడు ప్రసంగించారు. సోనియాగాంధీతో పాటు ఆయన కుమారుడు, రాయబరేలి కాంగ్రెస్ అభ్యర్థి రాహుల్ గాంధీ, కుమార్తె ప్రియాంకగాంధీ కూడా ఈ బహిరంగ సభలో పాల్గొన్నారు. చాలా కాలం తర్వాత మీ మధ్యకు రాగలిగినందుకు ఎంతో సంతోషంగా ఉంది. ఎంపీగా మీకు సేవలందించే అవకాశం నాకు కలిగించారు. నా జీవితంలో ఎప్పటికీ దీన్ని మరిచిపోలేను. గత వందేళ్లుగా ఈ గడ్డతో మా కుటుంబ అనుబంధం వేళ్లూనుకుని ఉంది. ఈ అనుబంధం గంగాజలంలా స్వచ్ఛమైనది. అవధ్, రాయబరేలిలో రైతుల ఆందోళనతో ఈ అనుబంధం మొదలైందని సోనియాగాంధీ పేర్కొన్నారు. రాయబరేలి ప్రజలు, మాజీ ప్రధాని దివంగత ఇందిరా గాంధీ ద్వారా తాను నేర్చుకున్న పాఠాలే తన పిల్లలైన రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీకి నేర్పానని చెప్పారు. రాయబరేలి ప్రజలకు ఇందిరాగాంధీ హృదయంలో ప్రత్యేక స్థానం ఉండేదని, ఆమె పనితీరును తాను చాలా దగ్గర నుంచి పరిశీలించానని, ఇక్కడి ప్రజలంటే ఆమెకు ఎనలేని అభిమానం ఉండేదన్నారు. ఇందిరాంగాంధీ నుంచి నేర్చుకున్న పాఠాలనే తాను తన పిల్లలకు చెప్పానని తెలిపారు. అందరినీ గౌరవించడం, బలహీనులను పరిరక్షించడం, ప్రజల హక్కులపై జరుగుతున్న అన్యాయాలను ఎదిరించి పోరాడటం, ఎలాంటి భయాలకు తావీయకుండటం వంటి పాఠాలు వారికి నేర్పానని చెప్పారు. రాయబరేలి ప్రజల ప్రేమ కారణంగా తనకు ఒంటరిగా ఉన్నాననే భావన ఎప్పుడూ కలగలేదని సోనియాగాంధీ అన్నారు. 'ఈరోజు నా కుమారుడిని మీ చేతుల్లో పెడుతున్నాను. అతన్ని ఆదరించండి. నన్ను ఎలా ఆదరించాలో నా కుమారుడిని కూడా గుండెల్లో పెట్టుకోండి. రాహుల్ మీ ఆశలను వమ్ము చేయడు' అంటూ సోనియాగాంధీ భావోద్వేగానికి గురయ్యారు. రాహుల్ గాంధీ ప్రస్తుతం పోటీ చేస్తున్న రాయబరేలి నియోజకవర్గానికి సోనియాగాంధీ 2004 నుంచి వరుసగా నాలుగు సార్లు ప్రాతినిధ్యం వహించారు. ఈసారి ప్రత్యక్ష ఎన్నికలకు దూరంగా ఆమె రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఐదో విడత ఎన్నికల్లో భాగంగా మే 20న రాయబరేలిలో పోలింగ్ జరుగనుంది.

# అంతర్జాతీయ స్థాయికి కోహెడ మార్కెట్ అభివృద్ధి

- ఖమ్మం మార్కెట్ అభివృద్ధికి ప్రణాళికలు
- మార్కెట్ యార్డులపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు
- జిల్లాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు ప్రాధాన్యం
- టెస్కో ద్వారా శానిటరీ నాప్‌కిన్‌ల తయారీకి చర్యలు
- ఉన్నతస్థాయి సమీక్షలో మంత్రి తుమ్మల ఆదేశాలు

**హైదరాబాద్,మే17(పీపుల్స్ మోటివేషన్):**

తెలంగాణకు తలమానికంగా నిలవనున్న కొహెడ పండ్ల మార్కెట్ నుంచి అంతర్జాతీయంగా పండ్ల ఎగుమతులు జరిగేలా చర్యలు తీసుకోనున్నామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. దీనిని అంతర్జాతీయ స్థాయి మార్కెట్‌గా అభివృద్ధి చేస్తామని అన్నారు. అధికారులతో ఆయన సమావేశమై మాట్లాడారు. అన్ని మౌళిక సదుపాయాలతో కొహెడ మార్కెట్ యార్డుని అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్ యార్డును కూడా అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో మార్కెటింగ్, గిడ్డంగుల సంస్థ గోదాములపై సౌరశక్తి ప్యానెల్స్ ఏర్పాటు దిశగా చర్యలు తీసుకోవాలి. తరచూ సంభవిస్తున్న అకాల వర్షాల నేపథ్యంలో రైతులు పంట నష్టపోకుండా ప్రతి జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, తెలంగాణ రాష్ట్ర చేనేత సహకార సంఘం టెస్కో సంస్థ ద్వారా రాష్ట్రంలో 'శానిటరీ నాప్‌కిన్' తయారీ యూనిట్లు ఏర్పాటు చేయాలి. అలాగే, బుగ్గపాడు మెగా టెక్స్‌టైల్ పార్కులో వచ్చే నెలలలో పరిశ్రమల ప్రారంభోత్సవం దిశగా చర్యలు తీసుకోవాలని తుమ్మల అధికారులకు దిశానిర్దేశం చేశారు. టెస్కో ద్వారా రాష్ట్రంలో శానిటరీ నాప్ కిన్ తయారీ యూనిట్ల ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. సచివాలయంలో తుమ్మల నాగేశ్వరరావు తన శాఖలపై పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్, టీ.ఎస్.ఐ.ఐ.సి ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, జౌళిశాఖ సంచాలకులు అలుగు వర్షిణి, హార్టికల్చర్ సంచాలకులు అశోక్ రెడ్డి, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సంచాలకులు జి. లక్ష్మీబాయితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ.. అకాల వర్షాల వలన రైతులు పంట నష్టపోకుండా ప్రతి జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మార్కెటింగ్ , గిడ్డంగుల సంస్థ గోదాములపైన సోలార్ ప్యానెల్స్ ను ఏర్పాటు దిశగా చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల సూచించారు. కొహెడ పండ్ల మార్కెట్ నుండి అంతర్జాతీయంగా పండ్ల ఎగుమతులు జరిగేలా అన్ని మౌళికసదుపాయాల తో అభివృద్ధి చేయుటకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆయన అన్నారు. బుగ్గపాడు మెగా టెక్స్ టైల్ పార్కులో వచ్చేనెలలో పరిశ్రమల ప్రారంభోత్సవం దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణకు తలమానికంగా నిలుస్తున్న కొహెడ పండ్ల మార్కెట్ నుంచి అంతర్జాతీయంగా పండ్ల ఎగుమతులు జరిగేలా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా అత్యాధునిక మౌలిక సదుపాయాలతో కొహెడ మార్కెట్ యార్డుని అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు మార్కెట్ అభివృద్ధికి సబంధించిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే ఖమ్మం వ్యవసాయ మార్కెట్ యార్డును సైతం అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశాలు మంత్రి నాగేశ్వర రావు జారీ చేశారు. దానితో పాటుగా రాష్ట్రంలో మార్కెటింగ్, గిడ్డంగుల సంస్థ గోదాములపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. టెస్కో సంస్థ ద్వారా రాష్ట్రంలో శానిటరీ నాప్‌కిన్ల తయారీ యూనిట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

## తెలంగాణ వ్యాప్తంగా పీజీఈసెట్ పరీక్ష వాయిదా

**జూన్ 10 నుంచి 13 వరకు తిరిగి నిర్వహణ**

**హైదరాబాద్,మే17(పీపుల్స్ మోటివేషన్):**

తెలంగాణ వ్యాప్తంగా పీజీఈసెట్ పరీక్షను వాయిదా వేయాలని జేఎన్టీయూహెచ్ నిర్ణయించింది. జూన్ 6 నుంచి 9 వరకు జరగాల్సిన టీఎస్ పీజీఈసెట్ పరీక్షలను జూన్ 10 నుంచి 13 వరకు నిర్వహించనున్నట్లు కన్వీనర్ అరుణ కుమారి తెలిపారు. స్టాఫ్ సెలక్షన్ కమిషన్, ÷ూఖాఅ గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షల నేపథ్యంలో షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చేసినట్లు పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం విద్యార్థులు ఉన్నత విద్యామండలి వెబ్ సైట్‌ని సందర్శించాలని తెలిపింది. పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సు చేయడానికి ప్రభుత్వం నిర్వహించే ఎంట్రన్స్ ఎగ్జామ్ పీజీఈ సెట్. అభ్యర్థులు బీఈ, బీటెక్, బీఆర్క్, బీఎ÷-లానింగ్, బీఫార్మసీ, బీఎస్సీ ఉత్తీర్ణులై వారు అర్హులు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation
శనివారం । మే । 18 । 2024



# ప్రెగ్నెన్సీ సమయంలో డ్రాగన్ ఫ్రూట్‌ను తింటే..

ప్రెగ్నెన్సీ అనేది ప్రతి మహిళ జీవితంలో ఒక మధురమైన సమయం. ఆ టైంలో ఏం తినాలి.. ఏం తినకూడదు.. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. ఇలా ఎన్నో ఆలోచిస్తూ ఉంటారు. కడుపులోని బిడ్డ ఆరోగ్యంగా పుట్టేందుకు చాలా కేర్ తీసుకుంటారు. అయితే మామూలు సమయంతో పోలిస్తే ప్రెగ్నెన్సీ టైంలో తల్లికి మరియు కడుపులోని శిశువుకు అనేక పోషకాలు అవసరం అవుతాయి. అవన్నీ అందించాలంటే కచ్చితంగా డైట్ లో పోషకాహారం ఉండేలా చూసుకోవాలి. అయితే అటువంటి ఆహారాల్లో డ్రాగన్ ఫ్రూట్ ఒకటి.దీనిలో మెగ్నీషియం, కాల్షియం, ఐరన్, ఫాస్ఫరస్ వంటి మినరల్స్ తో పాటు విటమిన్ సి, విటమిన్ బి, ప్రోటీన్, ఫైబర్ వంటి పోషకాలు డ్రాగన్ ఫ్రూట్ లో మెండుగా ఉంటాయి. డ్రాగన్ ఫ్రూట్ ద్వారా శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్స్ కూడా పొందవచ్చు. ప్రెగ్నెన్సీ సమయంలో డ్రాగన్ ఫ్రూట్ తీసుకోవడం వల్ల చాలా లాభాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. కడుపులోని శిశువు నాడీ వ్యవస్థ అభివృద్ధికి విటమిన్ బి12 ముఖ్యపాత్రను పోషిస్తుంది. అయితే డ్రాగన్ ఫ్రూట్ లో విటమిన్ బి12 పుష్కలంగా ఉంటుంది. అందువల్ల ప్రెగ్నెన్సీ టైంలో మహిళలు డ్రాగన్ ఫ్రూట్ ను కచ్చితంగా తీసుకునేందుకు ప్రయత్నించాలి.అలాగే ప్రెగ్నెన్సీ సమయంలో కొందరి మహిళలకు ఏ వాసన పడదు. ముఖ్యంగా పాలు తాగడానికి అస్సలు ఇష్టపడరు. అయితే పాలకు బదులుగా డ్రాగన్ ఫ్రూట్ ను తీసుకుంటే అందులో ఉండే క్యాల్షియం దీని ద్వారా భర్తీ చేయవచ్చు. డ్రాగన్ ఫ్రూట్ లో ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. డ్రాగన్ ఫ్రూట్‌ను రోజు తీసుకుంటే జీర్ణవ్యవస్థ చురుగ్గా సాగుతోంది. అజీర్తి, మలబద్ధకం, గ్యాస్ వంటి సమస్యలు వేధించకుండా ఉంటాయి. ప్రెగ్నెన్సీ టైంలో ఎక్కువ శాతం మంది రక్తహీనత బారిన పడుతుంటారు. అయితే ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు డ్రాగన్ ఫ్రూట్ సహాయపడుతుంది. డ్రాగన్ ఫ్రూట్ లో ఉండే ఐరన్ హిమోగ్లోబిన్ శాతాన్ని పెంచుతుంది.



రక్తహీనతను తరిమి కొడుతుంది. అంతే కాదు డ్రాగన్ ఫ్రూట్ రోగ నిరోధక వ్యవస్థను బలపరుస్తుంది. బాడీని హైడ్రేటెడ్ గా ఉంచుతుంది మరియు చర్మాన్ని కాంతివంతంగా సైతం మెరిపిస్తుంది.

## ఉప్మా తినడం లేదా.. అయితే ఈ విషయాలు తెలుసుకోండి..!!



ఉప్మా అంటే చాలామంది ఎక్కువగా తినడానికి మక్కువ చూపించరు. అంతేకాకుండా ఇది ఒక డైట్ ఫుడ్ బ్రేక్ ఫాస్ట్ లలో చాలా సులువుగా చేసుకునేటువంటి టిఫన్లలో ఇది కూడా ఒకటి..అతి తక్కువ సమయంలోనే దీనిని తయారు చేయడం.. ముఖ్యంగా ఉదయం పూట అల్పాహారంగా తీసుకుంటూ ఉంటారు. కానీ ఇంట్లో తయారు చేసే ఉప్మాలో మాత్రం తినరు అలాగే హొటల్స్ లో ఇతరత్రా వాటిలో దొరికేటువంటి టిఫన్లను ఎక్కువగా తింటూ ఉంటారు. అయితే ఉప్మా తినడం వల్ల కలిగే పలు రకాల ప్రయోజనాలను తెలుసుకుందాం. అయితే ఉప్మాన తినడం వల్ల ఎముకలు చాలా దృఢంగా తయారవుతాయి.. గుండె మరియు ఊపిరితిత్తులు ఆరోగ్యంగా ఉండడానికి చాలా ఉపయోగపడుతుంది. ఉప్మాలో ప్రోటీన్స్ కూడా చాలా ఎక్కువగానే లభిస్తాయి.. దీని అతి తక్కువ నూనెతో తయారు చేయడం వల్ల ఆరోగ్యానికి సైతం హాని కలగకుండా ఉంటుందట. ఈ ఉప్మాలో శనగపప్పు, పెసరపప్పు ,పల్లీలు వంటివి వేసుకొని తినడం వల్ల ఆరోగ్యానికి చాలా మేలు కలిగిస్తుంది.. వాతావరణం చల్లగా ఉన్న సమయంలో జరుగు జరం నుంచి ఉపశమనం పొందడానికి ఉప్మా అని చాలామంది సజెషన్ ఇస్తూ ఉంటారు. ఒక్కో ప్రాంతంలో ఒక్క విధంగా ఉపమాన సైత తయారు చేస్తూ ఉంటారు తెలుగు రాష్ట్రాలలో అయితే ఎక్కువగా క్యారెట్ బీన్స్ బటాని తదితరు కూరగాయలను సైతం ఎక్కువగా వేసుకొని చేస్తూ ఉంటారు.అందుచేతనే ఉప్మా తినడం వల్ల శరీరానికి అవసరమైనటువంటి పోషకాలు కూడా చాలా పుష్కలంగా లభించడమే కాకుండా సులువుగా జీర్ణక్రియ మెరుగుపడుతుందట. అలాగే బరువు తగ్గడంలో కూడా ఉప్మా చాలా సహాయపడుతుందని నిపుణులు తెలుపుతున్నారు. ఈ రకంగా అయినా సరే ఆరోగ్యానికి మేలు చేస్తుంది ఉప్మా అందుకే వారంలో కనీసం ఒక్కసారైనా సరే వీటిని చేసుకునే తినడం మంచిదని వైద్యుల సైతం తెలియజేస్తూ ఉన్నారు. మరి ఎవరైతే ఉప్మా తినకుండా ఉన్నారా వారు ఈ విషయం తెలుసుకొని తింటే ఆరోగ్యానికి మంచిది.


## ఆర్థరైటిస్ సమస్యతో బాధపడుతున్నారా?



ఆర్థరైటిస్ సమస్య వయసుతో సంబంధం లేకుండా అందర్నీ వేధిస్తుంది. ఇది ఒక కీళ్ల సమస్య. ప్రస్తుతం ఈ వ్యాధి అన్ని వయసుల వారిని వేధిస్తోంది. అయితే ఈ సమస్య నుంచి బయటపడాలి అంటే ఆహారంలో కొన్ని మార్పులు చేసుకోవాలి. ఆలస్యం చేయకుండా ఆర్థరైటిస్ పేషెంట్లు తమ ఆహారంలో ఏయే విషయాలను నివారించాలో తెలుసుకుందాం. తీపి పదార్థాలను ఎక్కువగా తీసుకోవడం వల్ల కీళ్ల నొప్పులు మరింత పెరుగుతాయి .తరచుగా కీళ్ల నొప్పులతో బాధపడుతుంటే అధిక చక్కెర కంటెంట్ ఉన్న ఆహారాన్ని తినకూడదు. చాక్లెట్, మిఠాయి,తియ్యటి పానీయాలకు దూరంగా ఉండాలి. జంక్ ఫుడ్స్ ఆరోగ్యానికి చాలా హానికరం.శుద్ధి చేసిన ఆహార ధాన్యాలు జంక్ ఫుడ్స్ లో వినియోగిస్తారు. ఇది కీళ్ళనొప్పుల నొప్పి మరియు వాపును మరింత పెంచుతుంది. కీళ్లనొప్పులు ఉన్న రోగులు అలాంటి ఆహారాన్ని తినకుండా ఉండాలి.ఎక్కువ ఆల్కహాల్ తాగడం వల్ల అనేక తీవ్రమైన వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. ఇది కాకుండా క్రమం తప్పకుండా ఆల్కహాల్ తీసుకోవడం వల్ల ఆర్థరైటిస్ నొప్పి కూడా పెరుగుతుంది. ఇప్పటికే కీళ్లనొప్పులు ఉన్నవారికి, మద్యం సేవించడం వల్ల పరిస్థితి మరింత దిగజారుతుంది.ఏదైనా అతిగా తింటే ఆరోగ్యానికి హాని కలుగుతుంది. అలాంటప్పుడు ఉప్పు పరిమాణాన్ని కూడా తగ్గించాలి. ఆర్థరైటిస్ రోగులు ఆహారంలో ఉప్పును తక్కువ మోతాదులో చేర్చుకోవాలి.

## రన్నింగ్‌లో ఏది మంచిదో మీకు తెలుసా..?

ఈ రోజుల్లో ఆరోగ్య స్పృహ ఉన్నవారు ఉదయాన్నే లేచి ఇంటి బయట పరిగెత్తడం కంటే ఇంటి లోపల లేదా జిమ్‌లో ట్రెడ్‌మిల్‌పై పరిగెత్తడానికి ఇష్టపడతారు. ట్రెడ్‌మిల్,




అవుట్‌డోర్ రన్నింగ్‌లో ఏది మంచిదో మీకు తెలుసా? ఈ రెండింటికీ ఏమైనా తేడా ఉందా లేదా? నేను జిమ్‌కి వెళ్లాలా లేక ఫీల్డ్‌కు వెళ్లాలా అనే సందిగ్ధంలో మీరు కూడా ఉంటే మీ గందరగోళానికి పరిష్కారం తెలుసుకోండి. ట్రెడ్‌మిల్,బయట పరుగెత్తడం మధ్య సాధారణ పోలికను ఇప్పుడు చూద్దాం. ట్రెడ్‌మిల్‌లోని గాలి పీడనంనుండి రాదు కాబట్టి ఈ పరుగు పద్ధతి కొంచెం తేలికగా అనిపిస్తుంది. బహిరంగ ప్రదేశంలో రన్ చేస్తున్నప్పుడు ముందు నుండి గాలి ఒత్తిడి ఉంటుంది. ఇది పరుగుని కష్టతరం చేస్తుంది. ఇక్కడ మీకు కొన్ని అనుకూల చిట్కాను అందిస్తున్నాం. మీ ట్రెడ్‌మిల్‌ను 1% వంపులో ఉంచడం వలన కొండను అధిరోహించిన అనుభూతి కలుగుతుంది. ఇది మీ శక్తిని పెంచుతుంది. మీ హృదయాన్ని బలపరుస్తుంది. రెండు పద్ధతులు మీ గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. వ్యాయామం చేసేటప్పుడు మీరు పీల్చే ఆక్సిజన్ పరిమాణం, శక్తిని సృష్టించే శక్తితో నింపడం ట్రెడ్‌మిల్‌పై, బయట పరుగెత్తడానికి సమానమని పరిశోధన కనుగొంది. ట్రెడ్‌మిల్‌పై అదే వేగంతో పరిగెత్తే వారి కంటే ఇంటి వెలుపల నిర్దిష్ట వేగంతో పరిగెత్తే వ్యక్తులు 5% ఎక్కువ కేలరీలు బర్న్ చేస్తారని ఓ పరిశోధన కనుగొంది. అందువల్ల ఇంటి వెలుపల పరిగెత్తడం బరువు తగ్గడానికి మరింత సరైనదిగా పరిగణించబడుతుంది. ఖచ్చితంగా ట్రెడ్‌మిల్ కీళ్లకు మంచిది, ఎందుకంటే ఇది మెరుగైన షాక్ శోషణను ఇస్తుంది. సరళంగా చెప్పాలంటే ట్రెడ్‌మిల్ ఎక్కువ నొప్పులను గ్రహించగలదు. నొప్పుల ప్రభావం కీళ్ళు, చీలమండల వరకు చేరడానికి అనుమతించదు. అయితే ఇంటి బయట రోడ్డుపై ఈ నొప్పి నేరుగా కీళ్లపై పడటం వల్ల కొంతమందిలో కీళ్ల నొప్పులు వచ్చే అవకాశాలు ఎక్కువ.

## లోబీపీతో ఇబ్బందిపడుతున్నారా..!

ప్రస్తుత రోజుల్లో జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా రక్తపోటు సమస్య వేగంగా పెరుగుతోంది. శరీరం సాధారణ రక్తపోటు 120/80ఎఎంఎస్త్ర ఉండాలి. కానీ అది 90/60ఎఎంఎస్త్ర కంటే తక్కువగా ఉంటే అది తక్కువ రక్తపోటు గా పరిగణించబడుతుంది. ఈ స్థితిలో తల తిరగడం, కళ్ల ముందు చీకటి, తలనొప్పి, వాంతులు-వికారం, అలసట, బలహీనత వంటి లక్షణాలు కనిపించడం ప్రారంభిస్తాయి. సరైన సమయంలో బీపీని నియంత్రించుకోకపోతే గుండెపోటు, పక్షవాతం వంటి ప్రమాదకరమైన, ప్రాణాంతకమైన సమస్యలు వస్తాయి. ఇటువంటి పరిస్థితిలో కొన్ని ఆయుర్వేద నివారణలు తక్కువ రక్తపోటును నియంత్రించడంలో మీకు సహాయపడతాయి. అవేంటో ఇప్పుడు చూద్దాం..! కల్లు ఉప్పు: రక్తపోటు తక్కువగా ఉంటే మీరు దానిని నియంత్రించడానికి కల్లు ఉప్పును ఉపయోగించవచ్చు. ఇందులో పొటాషియం ఎక్కువగా ఉండటం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. అకస్మాత్తుగా బీపీ తగ్గితే అర టీస్పూన్ కల్లు ఉప్పును గ్లాసు నీటిలో కలిపి తాగితే పరిస్థితి అదుపులో ఉంటుంది. తులసి ఆకులు: తక్కువ రక్తపోటు సమస్యలో తులసి ఆకులు ప్రయోజనకరంగా పరిగణించబడతాయి. బీపీని నియంత్రించే విటమిన్ సి, పొటాషియం, మెగ్నీషియం సమృద్ధిగా ఉండే ఈ ఆకుల్లో యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఉంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో బీపీ తక్కువగా ఉంటే 4-5 తులసి ఆకులను నమలడం వల్ల తక్షణ ఉపశమనం పొందవచ్చు.నల్ల మిరియాలు: తక్కువ రక్తపోటు సమస్యను వదిలించుకోవడానికి నల్ల మిరియాలు ఉపయోగించడం కూడా ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. తక్కువ, అధిక దీూ పరిస్థితులలో ఇది ప్రయోజనకరంగా ఉంటుంది. మీ రక్తపోటు అకస్మాత్తుగా తగ్గినట్లయితే గోరువెచ్చని నీటిలో ఎండుమిర్చి కలపండి. తినండి. రోజుకు రెండు గ్రాముల కంటే ఎక్కువ ఎండుమిర్చి తినకూడదు. అశ్వగంధ: అశ్వగంధ అనేక రకాల సమస్యలలో ఉపయోగించబడుతుంది. బిపి తక్కువగా ఉన్నప్పటికీ అశ్వగంధ వినియోగం ప్రయోజనకరంగా ఉంటుంది. ఇందులో ఉండే పోషకాలు, గుణాలు రక్తపోటును అదుపులో ఉంచుతాయి. ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో ఒక చెంచా అశ్వగంధ పొడిని కలుపుకుని తాగితే బీపీ అదుపులో ఉంటుంది.


## కాల్చిన మొక్కజొన్నలను తింటే క్యాన్సర్ వస్తుందా ?

వర్షాకాలం రావడంతోనే.. మార్కెట్లో మొక్కజొన్నలు దర్శనమిస్తాయి. ఓ పక్క వర్షం పడుతూ ఉంటే.. అప్పుడే బొగ్గులపై కాల్చిన కంకులను వేడి వేడిగా తింటూ.. ఆ వెదర్ ను ఎంజాయ్ చేస్తూ ఉంటారు. తెల్ల మొక్కజొన్న, ఎర్రమొక్కజొన్నలతో పాటు.. స్వీట్ కార్న్ లు కూడా ఈ సమయంలోనే వస్తాయి. మొక్కజొన్నల్లో పిండి పదార్థం ఎక్కువగా ఉంటుంది. అలాగే ఫైబర్ కూడా లభిస్తుంది. ఇంకా ఎన్నో పోషకాలు కూడా ఉన్నాయి. సీజన్ వారీగా వచ్చే మొక్కజొన్నను తినడం వల్ల ఆరోగ్యానికి చాలా మేలు జరుగుతుంది. కంటిచూపును మెరుగుపరచడంలో, రక్తహీనతను తగ్గించడంలో, జీర్ణశక్తిని పెంచడంలో, మలబద్ధకాన్ని తగ్గించడంలో, రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంలో, క్యాన్సర్ బారిన పడకుండా కాపాడటంలో మొక్కజొన్న కంకులు సహాయపడుతాయి.కాగా.. నిప్పులపై కాల్చి తినే మొక్కజొన్నలకు రుచి ఎక్కువంటారు. నిజంగానే వాటి రుచే వేరు. అందుకే ఎక్కువమంది వీటిని తినేందుకే మొగ్గుచూపుతారు. ఉడికించడం వల్ల మొక్కజొన్న గింజల్లో ఉండే తీపి తగ్గిపోతుంది. అందుకే కాల్చిన కంకులనే తినడానికి ఇష్టపడతారు. రోడ్ల పక్కన, దూరప్రాంతాలకు వెళ్లేటపుడు హైవేల పక్కన అప్పటికప్పుడు కాల్చిన మొక్కజొన్నలను అమ్ముతుంటారు. అయితే కాల్చిన మొక్కజొన్నలను తింటే ఆరోగ్యానికి హాని జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. చైనా దేశ శాస్త్రవేత్తలు ఇటీవల 405 మంది పిల్లలపై జరిపిన పరిశోధనలో ఈ విషయాలు వెల్లడయ్యాయట. వరుసగా 16 రోజుల పాటు పిల్లలకు కాల్చిన మొక్కజొన్న కంకులను పెట్టి.. వారిపై పరిశోధనలు చేశారు. కాల్చిన కంకులను తినడం వల్ల దంతాలపై ఉండే ఎనామిల్ దెబ్బతింటుందని నిపుణులు తెలియజేశారు. కంకులను కాల్చడం వల్ల వాటి నుంచి ఫ్లోరిన్ అనే పదార్థం ఎక్కువగా విడుదలై.. అది దంతాలపై ఉండే ఎనామిల్ ను దెబ్బతీస్తుందని నిపుణులు తెలియజేశారు. శరీరంలో కూడా చెడు కొలెస్ట్రాల్ పెరిగి మంచి కొలెస్ట్రాల్ తగ్గుతుంది. శరీరంలో ఉండే కణాలు క్యాన్సర్ కణాలుగా మారే అవకాశం కూడా ఉన్నట్లు పరిశోధకులు తెలిపారు. శరీరంలో ఫ్రీ రాడికల్స్ స్థాయిలు పెరిగి.. క్యాన్సర్ తో పాటు వివిధ రకాల దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు కూడా తలెత్తే అవకాశం ఉందని కూడా వెల్లడించారు. కాబట్టి వీలైనంత వరకూ కాల్చిన కంకులను తినకపోవడమే ఆరోగ్యానికి మంచిదని చెబుతున్నారు. ఉడికించిన మొక్కజొన్న తినడం వల్ల ఆరోగ్యానికి మంచే జరుగుతుంది తప్ప ఎలాంటి అనారోగ్యం ఉండదంటున్నారు. ఎప్పుడైనా ఒకసారి కాల్చిన మొక్కజొన్నలను తినవచ్చు.



## 4 గంటలకు నిద్ర లేవడం వల్ల ఏం జరుగుతుందో తెలుసా..?

మారిన మన జీవన విధానం కారణంగా అలాగే ఉద్యోగరీత్యా మనలో చాలా మంది ఆలస్యంగా నిద్రిస్తున్నారు. దీంతో వారు ఆలస్యంగా మేల్కొంటున్నారు. పూర్వకాలంలో త్వరగా నిద్రించి ఉదయం 4 లేదా 5 గంటల లోపే నిద్రలేచి వారి పనులు వారు చేసుకునే వారు. కానీ నేటి తరుణంలో చాలా మంది రాత్రి 11 నుండి 12 వరకు మేల్కొని ఉండి ఆలస్యంగా నిద్రపోతున్నారు. అలాగే చాలా మంది నిద్రలేమి కారణంగా రాత్రి ఎప్పటికో నిద్రిస్తున్నారు. దీంతో ఉదయం పూట అలస్యంగా మేల్కొంటున్నారు. అయితే ఉదయం పూట ఆలస్యంగా మేల్కొనడం వల్ల మనకు నష్టమే తప్ప ఎటువంటి లాభం ఉండదని అదే త్వరగా నిద్రించి త్వరగా మేల్కొనడం వల్ల మన ఆరోగ్యానికి, అందానికి ఎంతో మేలు కలుగుతుందని నిపుణులు చెబుతున్నారు.ఉదయం పూట త్వరగా లేవడం వల్ల మనకు కలిగే ప్రయోజనాలు తెలిస్తే అందరూ ఉదయం త్వరగా మేల్కొంటారని నిపుణులు చెబుతున్నారు. అసలు ఉదయం పూట మనం ఎందుకు త్వరగా లేవాలి%" % ఉదయం పూట త్వరగా మేల్కొనడం వల్ల మనకు కలిగే ప్రయోజనాలు ఏమిటి.. అన్న వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం. ఉదయం త్వరగా మేల్కొవడం వల్ల మన పనితీరు మెరుగుపడుతుంది. అలాగే ఉదయం త్వరగా లేవడం వల్ల మన జీవితంలో అభివృద్ధి ఉంటుంది. మనం విజయం వైపు అడుగులు వేయగలుగుతాము. మన ఆలోచనా విధానం మారుతుంది. మనం మరింత తెలివిగా ఆలోచించగలుగుతాము. మనం పని చేసుకోవడానికి తగినంత సమయం లభిస్తుంది. అదే విధంగా ఉదయం పూట త్వరగా లేవడం వల్ల మనం చక్కటి అల్పాహారాన్ని తీసుకోగలుగుతాము. రోజంతా ఉత్సాహంగా ఉండగలుగుతాము. అలాగే త్వరగా మేల్కొవడం వల్ల శరీరానికి తగినంత నిద్ర లభిస్తుంది. అలసట దరి చేరకుండా ఉంటుంది. అంతేకాకుండా ఉదయం త్వరగా లేవడం వల్ల మానసిక ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. ఒత్తిడి మన దరి చేరకుండా ఉంటుంది. ఉదయం పూట త్వరగా లేవడం వల్ల మనం పని చేసే చోటుకు త్వరగా చేరుకోగలుగుతాము. దీంతో ట్రాఫిక్ బాదలు కూడా ఉండవు. అలాగే ఉదయం పూట త్వరగా లేవడం వల్ల మనం వ్యాయామం చేయడానికి తగినంత సమయం ఉంటుంది. శారీరకంగా, మానసికంగా ధృడంగా తయారవగలుగుతాము.




తెలుగు దినపత్రిక

పీపుల్స్ మోటివేషన్

People's Motivation







# కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌లో తారల తళుక్కులు

### క్యాట్ వాక్‌తో ఆకట్టుకున్న ఐశ్వర్య..ఊర్వశి రౌతాల

అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో ఫ్రాన్స్‌లో జరిగే కేన్స్‌కు ప్రత్యేకత ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఎందరో సినీ తారలు ఈ కార్యక్రమంలో పాల్గొని రెడ్ కార్పెట్‌పై సందడి చేస్తుంటారు. ప్రస్తుతం 77వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ అట్టహాసంగా జరుగుతోంది. ఈ వేడుకల్లో బాలీవుడ్‌కు చెందిన పలువురు స్టార్స్ సందడి చేస్తున్నారు. కేన్స్ ఫిలం ఫెస్టివల్‌లో మన తారలు తళుక్కుమన్నారు. ఇద్దరు తారలు తమ అందాల ఆరబోతతో ఆకట్టుకున్నారు. ఇందులో మాజీ ప్రపంచ సుందరి ఐశ్వర్య రాయ్ బచ్చన్ తళుక్కుమన్నది. కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఆ బ్యూటీ క్యాట్‌వాక్ చేసింది. మెగాలోపోలిస్ ఫిల్మ్ కోసం ఆమె రెడ్‌కార్పెట్‌పై జిగేల్మన్నది. ఫాల్గుణి అండ్ షేన్ పీకాక్ డిజైనర్లు రూపొందించిన బ్లాక్ గౌన్‌లో ఐశ్వర్య దర్శనమిచ్చింది. గత రెండు దశాబ్దాల నుంచి కేన్స్ ఫెస్టివల్‌లో ఐశ్వర్య.. ఫిల్మ్ లవర్స్‌ను థ్రిల్ చేస్తూనే ఉన్నది. త్రీడీ మెటాలిక్ ఎలిమెంట్స్ ఉన్న మోనోక్రోమ్ గౌన్‌లో ఐశ్వర్య కనిపించారు. అయితే ఐశ్వర్య కుడి చేతికి ఇటీవల గాయమైంది. అయితే ఏ కారణం చేత ఆమెకు గాయమైందో తెలియదు. కానీ చేతి కట్టుతోనే ఆమె క్యాట్‌వాక్‌లో పాల్గొన్నది. ఐశ్వర్య కూతురు ఆరాధ్య కూడా ఫిల్మ్ ఫెస్టివల్‌లో కనిపించింది. కియారా అద్వానీ, సోభితా దూళిపాళ, ఆదితి రావు హైదరీతో పాటు ఇతర బాలీవుడ్ నటీనటులు కేన్స్‌లో దర్శనమిచ్చారు. 77వ కేన్స్ ఫెస్టివల్‌లో ఐశ్వర్య క్యాట్‌వాక్‌లో పాల్గొనడం ఇది 21వసారి. ఐశ్వర్య రాయ్ బచ్చన్ రెడ్ కార్పెట్‌పై క్యాట్ వాక్‌తో ఆకట్టుకోగా.. తాజాగా మరో నటి ఊర్వశి రౌతేలా సైతం సందడి చేసింది. కస్టమ్ మేడ్ గౌనులో హొయలు పోతూ అందరినీ ఆకట్టుకుంది. ఇందుకు సంబంధించిన ఫొటోలను ఊర్వశి ఇన్‌స్టా వేదికగా అభిమానులతో పంచుకుంది. ప్రస్తుతం ఈ ఫొటోలు తెగ వైరల్ అవుతున్నాయి. ఇక ఈ ఏడాది కేన్స్ ఫిల్మ్‌ఫెస్టివల్‌లో ఐశ్వర్య తన కూతురు ఆరాధ్యతో కలిసి పాల్గొనింది. కియారా అద్వానీ, సోభితా దూళిపాళ, ఆదితి రావు హైదరీతో పాటు ఇతర బాలీవుడ్ నటీనటులు కేన్స్‌లో దర్శనమివ్వనున్నారు.



# గేమ్ ఛేంజర్ తరవాతే బుచ్చిబాబుతో సినిమా

గ్లోబల్‌స్టార్ రాంచరణ్ హీరోగా, అగ్ర దర్శకుడు శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న 'గేమ్ ఛేంజర్' షూటింగ్ మొదలై చాలా కాలం అయినా ఇప్పటికీ ఓ కొలిక్కి రాలేదు. ఇటీవల తాజా షెడ్యూల్ మొదలు పెట్టారు. అక్టోబర్‌లో విడుదల చేయాలన్న తాపత్రయంతో శరవేగంగా చిత్రీకరణ చేస్తున్నారు. ఈ చిత్రం తర్వాత రామ్‌చరణ్ 'ఉప్పెన' ఫేం బుచ్చిబాబు సానా దర్శకత్వంలో 'ఆర్‌సీ 16' వర్కింగ్ టైటిల్‌తో ఓ చిత్రం చేయబోతున్నారు. ఇటీవల గ్రాండ్‌గా ఈ చిత్రం పూజా రెగ్యులర్ షూటింగ్ ఇంకా మొదలు కాలేదు. దర్శకుడు బుచ్చిబాబు అయితే షూటింగ్ ఎప్పుడు మొదలుపెడదామా అని ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. అయితే 'గేమ్ చేంజర్' షూటింగ్ పూర్తి కాకుండా రాంచరణ్ ఈ సినిమా షూటింగ్ పాల్గొనకూడదని ఫిక్స్ అయ్యారట. ప్రస్తుతం ఈ వార్త నెట్టింట వైరల్ అవుతోంది. 'ఆర్‌సీ 16' షూటింగ్‌ను జూనలో ప్రారంభించనున్నట్లు సమాచారం. ఇందులో కథానాయికగా జాన్వీ కపూర్ ఎంపికయ్యారు. ఆస్కార్ విన్నర్ ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. గేమ్ ఛేంజర్ చిత్రాన్ని అక్టోబర్ 10 న విడుదల చేయాలని మేకర్స్ ఎ÷–లాన్ చేస్తున్నట్లు సమాచారం.

# ప్రభాస్ పోస్ట్‌పై అభిమానుల తర్జనభర్జలు

### ఆ ప్రత్యేక వ్యక్తి ఎవరంటూ నెటిజన్ల ఆసక్తి

టాలీవుడ్ స్టార్ హీరో ప్రభాస్ పెట్టిన ఇన్‌స్టా పోస్ట్ ప్రస్తుతం వైరల్‌గా మారింది. చాలా అరుదుగా సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ఆయన ఓ ఆసక్తికర పోస్ట్ పెట్టారు. దీంతో అది టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది. 'డార్లింగ్స్.. ఎట్టకేలకు మన జీవితంలోకీ ఓ ప్రత్యేక వ్యక్తి రాబోతున్నారు. వెయిట్ చేయండి' అంటూ రాసుకొచ్చారు. ఈ పోస్ట్‌లో చెప్పిన ప్రత్యేక వ్యక్తి ఎవరంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. దానికి సంబంధించిన స్క్రీన్ షాట్‌ను ఫ్యాన్స్ ఎక్స్‌లో షేర్ చేస్తున్నారు. ఆయన నటిస్తోన్న 'కల్కి' సినిమాలో కమల్ హాసన్ లుక్ రిలీజ్ చేయనున్నట్లు టాక్. ఈ సినిమా ప్రమోషన్స్ కోసమే ఈ పోస్ట్ పెట్టినట్లు సమాచారం. తనకు కమల్ హాసన్ అంటే ఎంత ఇష్టమో ప్రభాస్ ఇప్పటికీ చాలా సార్లు చెప్పారు. ఆయన ఈ సినిమాలో భాగమైనట్లు వెల్లడించినప్పుడు కూడా ఆనందంతో పోస్ట్ పెట్టారు.. 'నా హృదయంలో శాశ్వతంగా నిలిచిపోయే క్షణం. కమల్ హాసన్ లాంటి లెజెండరీ నటుడితో కలిసి పనిచేయడం నాకు దక్కిన గౌరవంగా, అదృష్టంగా భావిస్తున్నా' అని అన్నారు. ఇప్పుడు కూడా ఆయన కోసమే ప్రభాస్ ఈ పోస్ట్ పెట్టినట్లు అర్థమవుతోంది. మరికొందరు మాత్రం ఆయన పెళ్లి గురించి పెట్టారని చర్చించుకుంటున్నారు. ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రానున్న సైన్స్ ఫిక్షన్ థ్రిల్లరే 'కల్కి 2898 ఏడీ. ఇందులో కమల్‌హాసన్ ప్రతినాయకుడి పాత్ర పోషిస్తున్నారు. ప్రభాస్‌కు జోడీగా దీపిక పదుకొణె నటిస్తుండగా పశుపతి, దిశాపటానీ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. చిత్రీకరణ తుది దశలో ఉన్న ఈ మూవీ జూన్ 27న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.





## రాజమౌళి, మహేశ్‌బాబుల కాంబో క్రేజీ పాజెక్ట్‌పై ర్యూమర్స్..నమ్మవద్దన్న సంస్థ

స్టార్ డైరెక్టర్ రాజమౌళి దర్శకత్వంలో అగ్ర కథానాయకుడు మహేశ్ బాబు ఓ సినిమాలో నటించనున్న విషయం తెలిసిందే. ఈ క్రేజీ ప్రాజెక్ట్ ఎప్పుడు మొదలవుతుందా అని సినీ ప్రియులంతా ఎదురు చూస్తున్నారు. దీనికి సంబంధించిన చిన్న విషయం బయటకు వచ్చినా అది క్షణాల్లో వైరల్‌గా మారుతోంది. తాజాగా ఈ ప్రాజెక్ట్ కాస్టింగ్ గురించి ఓ వార్త సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతుంది. దీనిపై నిర్మాణ సంస్థ క్లారిటీ ఇస్తూ నోట్ రిలీజ్ చేసింది. 'రాజమౌళి–మహేశ్‌బాబు ప్రాజెక్ట్‌కు సంబంధించిన నటీనటుల ఎంపికపై రకరకాల వార్తలు వస్తున్నాయి. కొన్ని ఆంగ్ల వెబ్‌సైట్స్‌లో వెలువడిన కథనాలు మా దృష్టికి వచ్చాయి. కాస్టింగ్ డైరెక్టర్ వీరేన్ స్వామి సినిమాలో భాగమైనట్లు రాశారు. అందులో నిజం లేదు. ఈ మూవీకి సంబంధించి ఏ అప్‌డేట్ అయినా మేమే ఇస్తాం. ప్రొడక్షన్ హౌస్ నుంచి వచ్చే అధికారిక ప్రకటనను తప్ప మరే ఇతర అప్‌డేట్‌లను నమ్మొద్దు' అని శ్రీ దుర్గ ఆర్ట్స్ పేర్కొంది. ప్రస్తుతం దీని ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ భారీ ప్రాజెక్ట్‌కు 'మహారాజ్' అనే టైటిల్‌ను ఫిక్స్ చేసినట్లు కూడా వార్తలు వచ్చాయి. ఇందులో ఇండోనేషియా నటి చెల్సియా ఎలిజబెత్ ఇస్లాన్ హీరోయిన్‌గా, హాలీవుడ్ ప్రముఖ నటుడు క్రిస్ హెమ్స్‌వర్త్ కీలకపాత్ర పోషించనున్నారని కూడా జోరుగా ప్రచారమవుతోంది. మరోవైపు మహేశ్‌బాబు కూడా ఈ సినిమా కోసం సిద్ధమవుతున్నారు. తన లుక్‌ను కూడా మార్చుకున్నారు.

# లగ్గం మూవీ డబ్బింగ్ పార్ట్

టాలీవుడ్ యువ నటులు సాయిరోనక్, ప్రగ్యా నగ్రా జంటగా నటిస్తున్న చిత్రం 'లగ్గం'. పెళ్లి నేపథ్యంలో తెలుగు సంప్రదాయాలను కళ్లకు కడుతూ తెరకెక్కుతున్న ఈ సినిమాకు రమేశ్ చెప్పాల దర్శకత్వం వహిస్తుండగా.. నటకిరిటి రాజేంద్రప్రసాద్ చాలా రోజుల తర్వాత కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం పోస్ట్ ప్రోడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. అయితే తాజాగా ఈ మూవీ డబ్బింగ్ పనులు మొదలుపెట్టినట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. రాజేంద్రప్రసాద్ తన పాత్రకు డబ్బింగ్ చెబుతున్న ఫొటోను ఎక్స్ వేదికగా పంచుకుంది. ఈ సినిమాపై దర్శకుడు మాట్లాడుతూ.. పెళ్లి తాలూకు ఆటపాటలు, మర్యాదలు, భావోద్వేగాలతో సాగుతుంది. తెలంగాణ నేపథ్యంలో చక్కటి ప్రేమకథగా అలరిస్తుంది' అన్నారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రానున్న ఈ సినిమాలో రోహిణి, సప్తగిరి, ఎల్బీ శ్రీరామ్, రఘుబాబు ముఖ్య పాత్రలు పోషిస్తుండగా.. వేణుగోపాల్ రెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి కెమెరా: బాల్‌రెడ్డి, సంగీతం: చరణ్ అర్జున్, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: రమేష్ చెప్పాల.



Printed, Published and Owned by M.RAMESH, H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh State, and Printing at PSR Printers, No.87-569, Beside, Chenchureddy Apartment, Madhava nagar,Kurnool - 518002 District, Andhrapradesh, Published from H.No. H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh, Editor : M.RAMESH, Mob : 8008622746,E-mail : peoplesmotivation22@gmail.com